

అ..టెన్షన్!

నేడే ప్రజా తీర్పు

- ఉత్కంఠకు నేటితో తెర
- ఉదయం 8 నుంచే కౌంటింగ్
- జిల్లాలో ఓటర్లు 16,23,149
- ఓటేసిన వారు 13,13,645
- ఓటింగ్ 80.93 శాతంగా నమోదు
- 13 రౌండ్లలోనే తొలి ఫలితం కొవ్వూరు
- 20 రౌండ్లలో చివరిగా రాజమండ్రి రూరల్
- ఇదే సమయంలో పార్లమెంట్ ఫలితం

అంతటా అ..టెన్షన్.. ఒక వైపు అభ్యర్థులు.. మరో వైపు అధికారులు అందరిలోనూ టెన్షన్.. టెన్షన్.. ఎందుకంటే నేడే ఓటరు తీర్పురానుంది.. ఈ నేపథ్యంలో అటు పల్లెలు..ఇటు గ్రామాల్లోనూ ఏం జరుగుతుందో.. ఏమవుతుందో..ఫలితం ఎలా ఉంటుందోననే చర్చ సాగుతోంది. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కూటమికి అనుకూలంగా ఉన్నా టెన్షన్ మాత్రం తగ్గలేదు. మరో వైపు కూటమి అభ్యర్థుల్లో గెలుపు ధీమా కనిపిస్తుంటే.. వైసీపీ అభ్యర్థులు మాత్రం డీలాగా ఉన్నారు. ఏదేమైతేనేం మరి కొద్ది గంటల్లోనే విజేతలెవరో.. పరాజితులెవరో తేలిపోనుంది. రాబోయే ఐదేళ్ల పాటు మన ఎమ్మెల్యేలు..ఎంపీ ఎవరో స్పష్టమైపోతోంది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఆరంభిస్తారు. సరిగ్గా 22 రోజుల కిందట మే 13వ తేదీన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సాగింది.. ఓటరు తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది.. మరికొద్ది గంటల్లోనే ఫలితం తేలనుండడంతో అందరిలోనూ భరించలేని టెన్షన్ నెలకొంది. జిల్లాలోని రాజమహేంద్రవరం పార్లమెంట్, రాజమహేంద్రవరం సిటీ, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఆయా నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను దివాన్‌చెరువులోని ఆదికవి నన్నయ వర్సిటీ స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచారు. ఆ ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను మంగళవారం ఉదయం నుంచి అక్కడే లెక్కిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు పూర్తి ఫలితాలు వెల్లడవుతాయి.

- (రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)





నన్నయ వర్సిటీ మెయిన్‌గేట్ ఎదుట పాస్‌లు పరిశీలిస్తున్న పోలీసులు

ఏ ఫలితం ఎప్పుడంటే..

కొవ్వూరు ఎస్సీ నియోజకవర్గంలో 13 రౌండ్లు లెక్కిస్తారు. మొదట ఫలి తం ఇదే వెల్లడవుతుంది. రాష్ట్రంలోనే ఇది తొలి ఫలితం అయ్యే అవకాశం ఉంది. దాంతో పాటు ఈ నియోజకవ ర్గంలో ఎంపీ అభ్యర్థులకు ఎన్ని ఓట్లు వచ్చాయో కూడా తేలిపోతుంది..నిడదవోలు నియోజకవర్గం ఓట్లను 15 రౌండ్లలో లెక్కిస్తారు. అందు వల్ల ఇది జిల్లాలో రెండో ఫలితం అవుతుంది. రాజానగరం ఓట్లను 16 రౌండ్లలో లెక్కిస్తారు. ఇది మూడో ఫలితం అవుతుంది. అనపర్తి, రాజమహేంద్రవరం సిటీ ఓట్లను ఒక్కొక్కటి 17 రౌండ్లలో లెక్కిస్తారు. ఇవి జిల్లాలో నాలుగో ఫలితంగా వెలువడవచ్చు. గోపాలపురం ఓట్లను 18 రౌండ్లలో లెక్కిస్తారు. ఇది జిల్లాలో ఐదో ఫలితంగా వెలువ డుతుంది. చివరగా రాజమహేంద్రవరం రూరల్ ఓట్లను 20 రౌండ్లలో లెక్కిస్తారు. ఇది చివరి ఫలితం అవుతుంది. దీంతో పాటు పార్లమెంట్ అభ్యర్థి ఫలితం ప్రకటిస్తారు. మొదటి ఫలితం 12 గంటల లోపు..చివరి ఫలితం మధ్యాహ్నం 2గంటలకు వెలువడే అవకాశం ఉంది.





కౌంటింగ్ కేంద్రం

లెక్కింపు సాగుతుందిలా..

17 కౌంటింగ్ సెంటర్లు ఏర్పాటు చేయగా ఒక్కో సెంటరులో 14 టేబుళ్ల వంతున ఏర్పాటు చేశారు. జిల్లాలో 1577 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటిని మొత్తం 98 టేబుళ్ల పరిధిలో 116 రౌం డ్లలో లెక్కిస్తారు. జిల్లాలో ఈటీపీబీ ఓటర్లు 405 మంది, పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు 15,383 మంది ఉన్నారు. జిల్లాలో మొత్తం 16,23,149మంది ఓటర్లు ఉండగా 13,13,645 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది 80. 93 శాతం. ఓట్ల లెక్కింపులో ఈవీఎంలలో ఓట్లను, పోస్టల్ బ్యాలెట్, హోంబ్యాలెట్ ఓట్లు, సర్వీసు ఓట్లను వేర్వేరు టేబుళ్ల మీద లెక్కించనున్నారు. మొదటి, రెండో రౌండ్ ఓట్ల లెక్కింపునకు గంట పడుతుంది. మూడో రౌండ్ నుంచి 20 నిమిషాల్లోపే పూర్తవుతుంది. మొదటగా పోస్ట ల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు పూర్తవుతుంది. ఒక్కో రౌండ్‌కు మూడు గంటలు పడుతుంది. అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు చెందిన ఓట్లను ఒకేసారి లెక్కించడం వల్ల ఏ రౌండ్ ఫలితం ఏంటనేది వెంటనే తెలిసిపోతుంది. కానీ పార్లమెంట్ ఫలితం మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లు లెక్కింపు తర్వాతే తేలుతుంది.

ఆ 2 కి.మీ నిషేధం

రాకపోకలు బంద్

జిల్లాలో ఓట్ల లెక్కింపు మంగళవారం నన్నయ వర్సిటీలో జరగనున్న నేపథ్యంలో రాజానగరం, దివాన్‌చెరువు గ్రామాల మధ్యలో హైవే రాకపోకలపై నిషేధాజ్ఞలు విధించారు. యూనివర్సిటీకి 2 కిలోమీటర్ల దూరం వరకూ నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయి. ఎన్నికల డ్యూటీ ఉన్నవారిని తప్ప ఇతరులను అనుమతించరు. దివాన్‌చెరువు గ్రామంలో మంగళవారం దుకాణాలకు బంద్ ప్రకటించారు. ఆర్టీసీ బస్సులను ట్రాఫిక్ మళ్లించారు. రాజమండ్రి నుంచి విశాఖ వెళ్లే బస్సులు కొంతమూరు, ఎయిర్‌పోర్టు, బూరుగుపూడి, దోసకాయలపల్లి, నందరాడ, నరేంద్రపురం మీదుగా రాజానగరం జంక్షన్ నుంచి జాతీయ రహదారికి వెళతాయి. విశాఖ నుంచి రాజమహేంద్రవరం, విజయవాడ వైపు వెళ్లే బస్సులు తిరిగే అదే రూట్‌లో వస్తాయి. రాజానగరం దుర్గమ్మ గుడి జంక్షన్ నుంచి వాహనాలకు అనుమతి లేదు. దివాన్‌చెరువు నుంచి కౌంటింగ్ సెంటర్ వైపు కూడా ఇతర వాహనాలకు అనుమతి లేదు.

అత్యవసర సర్వీసులకు రైట్ రైట్

దేవరపల్లిలో గూడ్స్ వాహనాలను ఉదయం 4 గంటల నుంచి నిలిపివేస్తారు. ఉదయం 9 గంటల తర్వాత పరిస్థితిని బట్టి నెమ్మ దిగా ఒక్కో వాహనాన్నీ వదులుతారు. పాలు, మందులు, కూరగా యలు వంటి వాహనాలను ఆపరు. అత్యవసర సర్వీసులను అడ్డుకోరు.అంబులెన్సులు, ఆస్పత్రులకు వెళ్లే వాహనాలకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఒకవేళ ఇబ్బంది ఏర్పడితే పోలీస్ కంట్రోల్ రూం డయల్ 100/112కి ఫోన్ చేయవచ్చు.

గెలిచేదెవరో.. ఓడేదెవరో!

బరిలో 83 మంది అభ్యర్థులు

పోలింగ్ జరిగిన సరళి,ఎగ్జిట్ పోల్ సర్వేలు అంచనాల ప్రకారం జిల్లాలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులే విజయకేతనం ఎగరవేసే అవకాశం ఉంది. ఆ జోష్ కూటమి అభ్యర్థుల్లో కనిపిస్తోంది. జిల్లాలో రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఏడు నియోజకవర్గాలు ఉన్న సంగతి తెలిసిందే. వీటి పరిధిలో మొత్తం 83 మంది అభ్యర్థులు పోటీ చేశారు.7 అసెంబ్లీల పరిధిలో 71 మంది పోటీపడగా 59 మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్న సంగతి తెలిసిందే.కానీ పోటీ ప్రధానంగా కూటమి, వైసీపీ మధ్యే ఉంది. రాజమహేంద్రవరం లోక్‌సభ నుంచి కూటమి తరపున బీజేపీ రాష్ట్ర అధ్యక్షు రాలు, ఎన్టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేసిన సంగతి తెలిసిందే.ఆమె గెలుపు ధీమాతో ఉన్నారు. ఆమెకు పోటీగా వైసీపీ అభ్యర్థిగా డా.గూడూరి శ్రీనివాసరావు,కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పోటీపడ్డారు.ఈ పార్లమెంట్ స్థానం నుంచి మొత్తం 12 మంది బరిలో నిలిచారు.

తొలిసారి.. బరిలో వీరు..

జిల్లాలో తొలిసారి కూటమి తరపున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న నేతలు ఉత్సాహంగా ఉన్నారు. సర్వేలు కూడా వారికి అనుకూలంగా ఉన్నాయి. రాజమహేంద్రవరంసిటీ నుంచి ఆదిరెడ్డి వాసు తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. గత ఎన్నికల్లో ఆయన సతీమణి ఆదిరెడ్డి భవానీ ఇక్కడ నుంచి గెలిచి ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈసారి టీడీపీ ఆయనకు టికెట్ ఇవ్వడంతో పోటీ చేశారు.రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణ కూడా తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేశారు.గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకట్రాజు కూడా తొలిసారే పోటీ చేశారు.

ఆ ముగ్గురిపై అంచనాలు..

ఈ సారి జిల్లాలో తొలిసారిగా జనసేన నుంచి కందుల దుర్గేష్,బత్తుల బలరామకృష్ణ విజయకేతనం ఎగరవేస్తారనే అంచనాలు ఉన్నాయి. అవి మంగళవారం మధ్యాహ్నానికి స్పష్టమవుతుంది.నిడదవోలు నుంచి జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణ జనసేన నుంచి కూటమి అభ్యర్థిగా పోటీపడ్డారు.అనపర్తి నుంచి టీడీపీ సీనియర్ నేత, నల్లమిల్లి రామ కృష్ణారెడ్డి ఈసారి పొత్తు నేపథ్యంలో బీజేపీ అభ్యర్థిగా కూటమి తరపున పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఆయనకు బీజేపీ కలిసి వస్తుందని, విజయకేతనం ఎగరవేస్తారనే అంచనాలు న్నాయి. గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వర రావు కూడా కొవ్వూరు నుంచి తొలిసారిగా పోటీ చేశారు.వీరంతా గెలుపు ధీమాతో ఉన్నారు.

గోరంట్ల ఏడో సారి?

రాజమహేంద్రవరం రూరల్ నుంచి సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఏడోసారి అసెంబ్లీకి వెళతానని చెబుతున్నారు. ఏడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికై జిల్లాలో రికార్డు సాధిస్తానని అంటున్నారు. నియోజకవర్గంలో టీడీపీ, జనసేన,బీజేపీ కూటమిగా ఏర్పడడం వల్ల ఆయనకు మంచి ఫలితాలు రానున్నాయి.

మంత్రుల సంగతేంటో?

జిల్లాలో రాజ్యమేలిన మంత్రులు తానేటి వనిత, చెల్లుబోయిన వేణు తమ అదృష్టాన్ని మరోసారి పరీక్షించు కుంటున్నారు. వాస్తవానికి తానేటి వనిత గత ఎన్నికల్లో కొవ్వూరు నుంచి పోటీ చేసి గెలవగా, ఈసారి గోపాల పురం నుంచి బరిలో దిగారు. చెల్లుబోయిన వేణు గత ఎన్నికల్లో రామచంద్రపురం నుంచి పోటీ చేసి గెలవగా ఈసారి రాజమహేంద్రవరం రూరల్ నుంచి పోటీపడ్డారు. ఈ సారి కొత్తగా వైద్య వృత్తి నుంచి వచ్చిన గూడూరి శ్రీనివాసరావు వైసీపీ నుంచి లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసిన సంగతి తెలిసిందే. రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపీ మార్గాని భరత్ పోటీ చేశారు. గత ఎన్నికల్లో ఎంపీగా గెలిచి ఆయన ఈ సారి ఎమ్మెల్యేగా పోటీపడ్డారు. ప్రస్తుత గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెం కట్రావు కొవ్వూరు నుంచి పోటీపడ్డారు.ప్రస్తుత ఎమ్మెల్యేలు రాజానగరం నుంచి జక్కంపూడి రాజా, అనపర్తి నుంచి సత్తి సూర్యనారాయణరెడ్డి, నిడదవోలు నుంచి జి.శ్రీనివాస నాయుడు తిరిగి పోటీ చేసిన సంగతి తెలిసిందే. నిశ్శబ్ద విప్లవం మాదిరిగా సైలెంట్‌గా జరిగిన ఓటింగ్‌తో వీరంతా కంగారు పడుతున్నారు. ఆ కంగారుకు నేడు బ్రేక్ వేయనుంది.

ఓటరు నాడి ఎటో..

ఎన్నికల అంకం చివరి ఘట్టానికి చేరుకొంది. ఓటరు నాడి నేడు విడుదల కానుంది. ప్రజలు కట్టే పట్టం కోసం మూడు వారాల నిరీక్షణకు తెరపడనుంది. దీంతో చీమ చిటుక్కుమన్నా యంత్రాంగం ఉలిక్కిపడుతోంది. ప్రశాంతతకు మారుపేరుగా ఉండే తూర్పుగోదావరిలో గతంలో ఎన్నడూ లేని ఉద్వేగ వాతావరణం కనిపిస్తోంది. పైకి గుంభనంగా ఉన్నప్పటికీ భావోద్వేగాలతో చర్చలు నడిచాయి. అభ్యర్థులు నియోజకవర్గాలకు చేరుకున్నారు. ఎవరి లెక్కలు వారు వేసుకోవడంలో బిజీ అయిపోయారు. నేటి ఫలితాలకు ఒత్తిడిని తొక్కిపట్టుకుని క్షణాలు గడుపుతున్నారు. మూడు నెలల నుంచీ పోలీసులకు కునుకు లేదు. ఆ రోజులన్నీ ఒక ఎత్తు, ఈ రోజు మరో ఎత్తు కావడంతో ఎట్టి పరిస్థితుల్లోనూ అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో మునిగిపోయారు.పోలింగ్ రోజున ఓటు బటన్ నొక్కిన ఓటరు తమ కు నచ్చిన విధంగా చర్చల్లో ఉన్నారు.మార్పు కోసం ఆశ పడుతూ ఎదురు చూస్తున్నారు. మొత్తానికి జిల్లాలో ఎన్నడూ లేని విధంగా హైపర్ టెన్షన్ నిశ్శబ్ద రూపంలో గిరికీలు కొడుతోంది.మంగళవారం మధ్యాహ్నానికి పీఠాన్ని ప్రజలు ఎవరికిచ్చారనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

ఎవరి లెక్కలు వారివి..

ఎన్నికల్లో వివిధ పార్టీలు, స్వతంత్రులు బరిలో నిలిచినా పోటీ మాత్రం వైసీపీ, కూటమి మధ్యనే అనేది తెలిసిందే. ఈ నేప థ్యంలో ప్రధానంగా ఆ పార్టీ అభ్యర్థులు, క్యాడర్ లెక్కలు వేసు కోవడంలో బిజీగా గడుపుతున్నారు. అభ్యర్థులు పైకి చిరునవ్వులు చిందిస్తున్నా గుండెలు మాత్రం తీవ్రమైన ఉత్కంఠతను అనుభవిస్తున్నాయి. అధికారం ఎవరిదో, అప్పుల కుప్పలు ఎవరివో నేటి మధ్యాహ్నానికే తేలిపోనుంది. వైసీపీ నేతల్లో అయోమయంతో కూడిన బెంగ కనిపిస్తోంది.చాలా మటుకు ఓటర్లు రాష్ట్రం మళ్లీ గాడిలో పడే విధంగా బటన్ నొక్కారని ఓటింగ్ సరళిని బట్టి ఎగ్జిట్‌పోల్స్ సైతం అంచనా వేశాయి. దీంతో పార్టీల అధినేతలకంటే ఎక్కువగా 'మార్పు' కోసం ఓటరు అత్యంత ఆసక్తితో ఎదురు చూస్తున్నాడని తెలుస్తోంది. ఎన్నికల గుర్తుల్లో నెలకొన్న అయోమయం ఊహించని విధంగా ప్రాధాన్యం లేని అభ్యర్థులకు కూడా చెప్పుకోదగిన ఓట్లు తెచ్చి పెట్టే పరిస్థితి కానవస్తోంది. ఎగ్జిట్‌పోల్స్ కూడా కూటమికే విజయం ఖాయమంటూ వెల్లడించడంతో వైసీపీ నాయకులు డీలాపడిపోయారు.భవిష్యత్తు కార్యాచరణపై ఎవరి మార్గాల ను వారు ఇప్పటికే వెతుక్కుంటున్నారని సమాచారం. మరోవైపు కూటమి అభ్యర్థుల్లో విజయానందం తాండవిస్తోంది. కాస్త మెజారిటీలు తగ్గినా గెలుపు తమకే దఖలు పడుతుందనే ఆశాభావంతో ఉన్నారు.

పోలీస్ అటెన్షన్

సుమారు మూడు నెలల నుంచీ పోలీసులు ఎన్నికల విధులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. పూర్తి స్థాయిలో మోహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అధికారులు, సిబ్బందితో ఎస్పీ జగదీశ్ పూర్తి సమన్వయం చేసుకుంటూ, ఎక్కడా ఉద్రేకపడకుండా దాదాపు 90 రోజులు లాక్కొచ్చారు. పోలింగ్ రోజు ప్రశాంతంగా గడవడంతో పోలీసులు సగం ఊపిరి పీల్చుకున్నారు.మాచర్ల, పల్నాడులో వైసీపీ నాయకులు సృష్టించిన వీరంగం రాష్ట్రాన్ని ఉలికిపాటుకు గురి చేసింది. ప్రశాం తంగా ఉండే గోదావరి జిల్లాలపై కూడా పోలీసులు తీవ్రంగా దృష్టి సారించారు. 129 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి 39 పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేశారు. 59 మొబైల్ పార్టీలను, 130 క్విక్ రెస్పాన్స్ టీంలను రంగంలోకి దించారు.పోలీసులకు అద నంగా సీఆర్పీఎఫ్,ఎస్ఎస్‌బీ బలగాలున్నాయి.జిల్లా అంతా డ్రోన్ కెమెరాలతో లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతతో పాటు రెడ్‌జోన్‌గా ప్రకటించారు.



జిల్లాలో భద్రతకు 1600 మంది

- ఫోన్ చేస్తే 10 నిమిషాల్లో స్పాట్‌కు
- ఎక్కడికక్కడ డ్రోన్ కెమెరాలు
- 130 క్విక్ రెస్పాన్స్ టీంలు
- అభ్యర్థుల ఇళ్ల వద్ద భారీ భద్రత
- ఆంధ్రజ్యోతితో ఎస్పీ జగదీశ్

కౌంటింగ్‌కి భద్రత పరంగా సర్వ సన్నద్ధంగా ఉన్నాం. జిల్లా మొత్తం పోలీస్ పహారాలో ఉంది. ఎక్కడ ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడినా పది నిమిషాల్లో చేరుకొని నియంత్రించే విధంగా బలగాలను మోహరించాం. రెండు కంపెనీల సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్‌తో కలిపి మొత్తం 1600 మంది భద్రత సిబ్బంది విధుల్లో ఉంటారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల ఇళ్లు, కార్యాలయాల వద్ద బారికేడ్లు, లైవ్ స్ట్రీమింగ్‌తో సీసీ కెమెరాలతో పాటు సిబ్బందిని ఏర్పాటు చేశాం. అభ్యర్థులు, వారి క్యాడర్‌లోని ముఖ్యులపై నిరంతరాయంగా పోలీస్ నిఘా ఉంటుంది. కొన్ని ఇళ్ల వద్ద కూడా లైవ్ స్ట్రీమింగ్‌తో కెమెరాలు పెట్టాం. డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నాం. రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, నల్లజర్ల, రాజమండ్రి సిటీలో పెద్ద సంఖ్యలో డ్రోన్లు వాడుతున్నాం. గోపాలపురం, రాజానగరం, అనపర్తి అభ్యర్థుల వాహనాలకు ముందు వెనుక వాహనాల్లో పోలీసులు ఉంటారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు, క్యాడర్ కదలికలను ప్రతి నిమిషం గమనిస్తూ ఉంటాం. ఇబ్బందికరంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకుంటారు. జిల్లాలో 130కిపైగా క్విక్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశాం. దేవరపల్లి, కౌంటింగ్ కేంద్రం వద్ద రెండు 'వజ్ర' వాహనాలను మోహరించాం. అంబు లెన్సులను, మెడికల్ టీంలను అందుబాటులో ఉంచాం.గన్‌మ్యాన్లు అందరూ డ్యూటీలో ఉంటారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే ముందు మాటల్లో చెబుతాం. తర్వాత లాఠీ తీస్తాం. మరీ మితిమీరితే మా వైపు నుంచి పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి. ఎంతటి వారైనా కేసులు తప్పవు. ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువత భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి.

ఎన్నికల కేసుల్లో చిక్కితే భవిష్యత్ నాశనమే

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నంత కాలం అత్యంత కఠినమైన చట్టాలు అమల్లో ఉంటాయి. సజావుగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడానికే ఈ ఏర్పాటు జరిగింది. అలాంటి పరిస్థితుల్లో సంయమనం వీడితే కచ్చితంగా ఎన్నికల కేసుల్లో చిక్కుకుంటారు. ఒక సారి ఎన్నికల కేసులో చిక్కుకుంటే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.ఏ ఎన్నికలు జరిగినా ఆ నిందితులను అదుపులోకి తీసుకుంటారు. ఓటు వేయడానికి తీసుకెళ్లి వెనక్కు తీసుకొచ్చి పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెడతారు. ఎన్నికల కేసులు అత్యంత పకడ్బందీగా దర్యాప్తు చేస్తారు. రెండేళ్ల కిందట ఉప-ఎన్నికల్లో చేసిన అవకతవకలకు ఏకంగా ఓ ఐఏఎస్ అధికారిపై ఎన్నికల సంఘం ఈ మధ్య కఠినమైన చర్యలు తీసుకోవడం ఇప్పటికే చూశాం.ఎన్నికల సంఘం తీసుకొనే చర్యలు అంత తీవ్రంగా ఉంటాయి.అందువల్ల అటు గీత దాటకుండా అధికారులు, ఇటు సంయ మనం వీడకుండా ప్రజలు వ్యవహరించడం వారికే మంచిది. ఇప్పటికే జిల్లాలో సెక్షన్ 144 సీఆర్పీసీ, సెక్షన్ 30 పోలీస్ యాక్టు అమలులో ఉన్నాయి.శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను ఇప్పటికే పోలీసులు జైలుకు పంపించారు. 13 మందిపై పీడీ యాక్టు బనాయించారు. యువత ఎన్నికల కేసుల్లో ఇరుక్కుంటే జీవితం నాశనమైనట్టే ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులైపోతారు. ఊరేగింపులు,ధర్నాలు,గుమిగూడడం, బైక్‌లపై తిరగడం, బాణసంచా కాల్చడం వంటి వాటిపై నిషేధం ఉందని మరిచిపోవద్దు. గెలుపోట ములకతీతంగా వ్యవహరించాలని, అనవసరంగా రోడ్లపై తిరగవద్దని ఇప్పటికే ఎస్పీ పలు మార్లు సూచించడం గమనార్హం.



మద్యం దుకాణం వద్ద సోమవారం మందుబాబుల క్యూ..

నేడు మద్యం దుకాణాలు బంద్

రాజమహేంద్రవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కౌంటింగ్ అత్యంత ఉత్కంఠగా మారింది. పోలింగ్ తర్వాత కూడా వైసీపీ నాయకులు రెచ్చిపోయారు. ఎక్కడ అల్లర్లు సృష్టిస్తారో తెలియని క్షణాలు గడిచాయి. పరిస్థితులు అలా ఉడికిపోతున్నా జిల్లాలో మద్యం షాపులకు మాత్రం విరామం ఇవ్వలేదు. తొలుత కౌంటింగ్‌కి ఒక రోజు ముందు, ఆ రోజున, తర్వాతి రోజున మద్యం షాపులు, బార్లు మూతపడతాయని అధికారులు చెప్పారు. అంటే 3, 4, 5 తేదీల్లో తెరవకూడదు. కానీ, సోమవారం(3న) ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లు యథేచ్ఛగా నడి చాయి. దీంతో కౌంటింగ్ రోజుకు కావాల్సిన సరుకును పెద్ద ఎత్తున కొను గోలు చేశారని తెలుస్తోంది. పల్నాడు, మాచర్ల వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో మాత్రమే మూడు రోజులని, మిగతా చోట్ల ఎన్ని రోజులు మద్యం షాపులు మూతపడాలో జిల్లా ఎన్నికల అధికారి నిర్ణయిస్తారని అధికారులు చెబుతున్నారు. కౌంటింగ్ రోజైన బుధవారం కచ్చితంగా మూతపడతాయని.. గురువారం మద్యం షాపులు తెరవాలా వద్దా? అనే విషయం జిల్లా ఎన్నికల అధికారి నిర్ణయిస్తారని చెప్పారు.



ఆర్‌వోలతో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కౌంటింగ్ పరిశీలకులు, జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత

అభ్యర్థులు, ఏజెంట్లకు 2500 ఐడీ కార్డులు


ఆర్‌వోలతో కౌంటింగ్ పరిశీలకుల సమీక్ష

దివాన్‌చెరువు, జూన్ 3 : ఓట్ల లెక్కింపునకు రిటర్నింగ్ అధికార్లు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నారని జిల్లా ఎన్నికల అధికారిణి కె.మాధవీలత అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎన్నికల ఓట్లు లెక్కింపు ఏర్పాట్లపై లెక్కింపు పరిశీలకులు, ఆర్వోలతో అంశాల వారీగా సోమవారం సమీక్షించారు.ఎన్నికల సంఘం నియమనిబంధనలు, మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.17 లెక్కింపు కేంద్రాల వద్ద అత్యంత పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పైగా సీసీ కెమెరాలు ఉంటాయని తెలిపారు. లెక్కింపు పూర్తయిన తరువాత నివేదికలు సంసడం తదితర కార్యకలాపాలపై అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. సజావుగా లెక్కింపు ప్రక్రియను చేపట్టేందుకు సంసిద్ధంగా ఉన్నామని తెలిపారు. లెక్కింపు కేంద్రాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం నడచుకోవాలని అభ్యర్థులు, ఏజెంట్లకు స్పష్టం చేశామన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లకు దాదాపు 2500 ఐడీ కార్డులు జారీ చేశామన్నారు. లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. లెక్కింపు పరిశీలకులు కె.బాలసుబ్రహ్మణ్యం, కమల్‌కాంత్‌సరోఛ,బీజైకుమార్ కందయాత్‌రాయ్, టాన్‌సింగ్ జి.మోమిన్‌లు వారికి సంబంధించిన నియోజకవర్గాలవారీగా సమీక్ష నిర్వహించి తగిన సూచనలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు విషయంలో ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం జారీ చేసిన మేరకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రాజమండ్రి రూరల్‌ఆర్వో, జేసీ ఎస్.తేజ్‌భరత్, రాజమండ్రిఅర్బన్ ఆర్వో మునిసిపల్ కమీషనర్ కే.దినేష్‌కుమార్, కొవ్వూరు ఆర్వో, సబ్‌కలెక్టర్ అశుతోష్‌శ్రీవాత్సవ్, డీఆర్వో జీ.నరసింహులు, రాజానగరం ఆర్వో , ఆర్డీఓ ఏ.చైత్రవర్షిణి, గోపాలపురం ఆర్వో కె.ఎల్.శివజ్యోతి, అనపర్తి ఆర్వో ఎం.మాధురి, నిడదవోలు ఆర్వో ఆర్.వి.రమణానాయక్, పార్లమెంటుసహాయరిటర్నింగ్ అధికారి ఎస్.డి.సి.కృష్ణానాయక్, ట్రైనీ డిప్యూటీకలెక్టర్లు ఎం.భానుప్రకాష్, పి.సువర్ణ పాల్గొన్నారు.


మండపేట పట్టణంలో బలగాల కవాతు



చెయ్యేరులోని కోనసీమ జిల్లా కౌంటింగ్ కేంద్రం వద్ద సిబ్బంది సందడి


పిఠాపురంలో పోలీసు బలగాల మోహరింపు

కౌంటింగ్‌కు రెడీ

● విస్తృత ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం అధికారులు ● కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏర్పాటు చేసిన మూడు కౌంటింగ్ కేంద్రాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేశారు. రాజమహేంద్రవరం జిల్లాకు సంబంధించి ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. అలాగే కాకినాడ జిల్లాకు కాకినాడలోని జేఎన్టీయూకే కేంద్రంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి చెయ్యేరు ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ నిర్వహిస్తున్నారు. మూడు లెక్కింపు కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ప్రతి కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు..


కాకినాడలో స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు




కాకినాడ కేంద్రంలో ఏర్పాట్లు



సమీక్ష నిర్వహిస్తున్న రవిప్రకాష్

సమస్యాత్మక ప్రాంతాలపై
ప్రత్యేక దృష్టి

అల్లర్లు జరగకుండా బలగాల మోహరింపు

పిఠాపురంలో పర్యటించిన డీఐజీ రవిప్రకాష్

పరిస్థితులపై ఎస్పీలతో సమీక్ష

పిఠాపురం, జూన్ 3: కౌంటింగ్ సమయంలోనూ, తదనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఐజీ ఎం.రవి ప్రకాష్ వెల్లడించారు. ఆయన సోమవారం సాయంత్రం పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించారు. సర్కిల్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, ప్రత్యేక పరిశీలకుడు, ఎస్పీ రామ్మోహనరావు, ఇతర పోలీసు అధికారులు స్థానికంగా ఉన్న పరిస్థితులపై సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో పిఠాపురం, కాకినాడ నియోజకవర్గాలు, తూర్పుగోదావరి జిల్లాలోని రాజానగరం నియోజకవర్గాలను సెన్సిటివ్‌గా గుర్తించినట్లు తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంపై రాష్ట్రవ్యాప్తంగా దృష్టి ఉందని, ఈ నేపథ్యంలో పోలీసుశాఖాపరంగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పిఠాపురానికి ప్రత్యేకంగా ఎస్పీ స్థాయి అధికారిని నియమించామని, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు 50 మంది, సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీలు, క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు, పెట్రోలింగ్, మొబైల్ టీమ్‌లను రంగంలోకి దించామని వివరించారు. ఎక్కడా ఎటువంటి సంఘటన జరిగినా 15 నిమిషాల లోపుగానే అక్కడకు చేరుకునే విధంగా బలగాలను మోహరించామని చెప్పారు. జాతీయ రహదారితో పాటు కత్తిపూడి, సామర్లకోట, కాకినాడ రహదారులపై ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేసి అనుమతి లేని వారిని కాకినాడ వెళ్లకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. లాడ్జీలు, హోటల్స్‌ల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనధికారిక, ఇతర ప్రాంతాల వ్యక్తులు ఉన్నట్లు గుర్తిస్తే వారిని పంపివేస్తున్నట్లు తెలిపారు. తాటిపర్తి, విరవాడ సహా సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల ఫలితాలు వెలువడే సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలు సంయమనం పాటించాలని, శాంతియుతంగా ఉండాలని కోరారు. ఎవరైనా గొడవలకు దిగినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, దాడులు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని, అల్లర్లు, గొడవలకు దిగే వారిపై ఆర్‌పీ యాక్టు, ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీ షీట్లు తెరుస్తామని హెచ్చరించారు. కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. సమావేశంలో ఎస్పీలతో పాటు కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురానికి భారీగా పోలీసు బలగాలు

నాలుగు ప్లాటూన్ల సీఐఎస్ఎఫ్, ఏపీఎస్పీ, ఏఎన్ఎస్ పార్టీలు

ఏసీబీ ఎస్పీ రామ్మోహనరావు



పిఠాపురం, జూన్ 3: కౌంటింగ్ సమయంలో, అనంతరం పిఠాపురం నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిగా నియమితులయిన ఏసీబీ ఎస్పీ రామ్మోహన రావు సోమవారం రాత్రి వెల్లడించారు. నియోజకవర్గంలో రెండు ప్లాటూన్ల సీఐఎస్ఎఫ్, ఒక ప్లాటూన్ ఏపీఎస్పీ బలగాలతో పాటు ఒక ప్లాటూన్ ఏఎన్ఎస్ పార్టీ, సివిల్ పోలీసులు 100 మంది, ఇతర విభాగాలు నుంచి 25 మందిని బందోబస్తు నిమిత్తం వినియోగిస్తున్నామని వివరించారు. ఏడు క్విక్ రెస్పాన్స్ టీములు, ఏడు మొబైల్ టీములు, ఒక స్ట్రైకింగ్ ఫోర్స్, రెండు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు, వజ్ర వాహనం, రోప్ పార్టీలను రంగంలోకి దించామని తెలిపారు. 25 ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమస్యాత్మకంగా గుర్తించిన 18 గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, సమస్యలు సృష్టించే 30మందిని గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు. 509 మందికి సెక్షన్ 149 కింద నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్, ఎలక్షన్ అధికారులు అనుమతి పొందిన ఏజెంట్లు, అభ్యర్థులు, వారి తరపు ప్రతినిధులు మినహా మిగిలిన వారు కాకినాడ కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లోకి వెళ్లేందుకు అనుమతి లేదని చెప్పారు.


రాజమండ్రి నన్నయ వర్సిటీ కేంద్రం వద్ద తనిఖీలు


నన్నయ వర్సిటీ కౌంటింగ్ కేంద్రం


గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు



కాకినాడ జిల్లాకు సంబంధించి ఓట్లు లెక్కించే జేఎన్టీయూకే కౌంటింగ్ కేంద్రం

డైరెక్టర్ బుచ్చిబాబుకు నాగబాబు పరామర్శ


బుచ్చిబాబును పరామర్శిస్తున్న నాగబాబు

కొత్తపల్లి, మే 3: పితృ వియోగంతో బాధపడుతున్న సినీ డైరెక్టర్ సానా బుచ్చిబాబును కొత్తపల్లిలో సోమవారం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు పరామర్శించారు. తండ్రి లేని లోటు తీర్చడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. మనో నిబ్బరంతో తదుపరి కార్యక్రమాన్ని కొనసాగించాలని ధైర్యం చెప్పారు. పలువురు జనసేన నాయకులు, పవన్‌కల్యాణ్ అభిమానులు పరామర్శించారు.

వక్ర పాదాల సమస్యకు శాశ్వత పరిష్కారం

జీజీహెచ్ (కాకినాడ) జూన్ 3 వక్ర (వంకర) పాదాలతో పుట్టిన పిల్లల అంగ వైకల్యానికి క్యూ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్ట్ (సీఐఐటీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ జీజీహెచ్‌లో పూర్తిస్థాయి చికిత్సను అందించడం ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆర్థోపెడిక్ విభాగాధిపతి డా.ఎంపీఆర్ విఠల్ అన్నారు. వరల్డ్ క్లబ్ ఫుట్ డే సందర్భంగా సోమవారం జీజీహెచ్ ఆర్థో విభాగంలో వక్ర పాదాలతో పుట్టిన పిల్లలకు ప్రత్యేక చికిత్సను అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.ఎస్.లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్, అనస్తీషియా విభాగాధిపతి డా. ఏ విష్ణువర్ధన్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.విఠల్ మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే వక్రపాదాల అంగవైకల్యం సాధారణంగా మేనరికపు వివాహాలు లేదా గర్భస్థ సమయంలో వాడకూడని మందులు వాడడం లేదా గర్భం దాల్చిన సమయంలో తల్లికి కొన్ని జబ్బులు రావడం లేదా జన్యుపరమైన కొన్ని కారణాల వల్ల లేదా వంశపారంపర్యంగా సంక్రమించే పరిస్థితులు ఉన్నాయన్నారు. వక్ర పాదంతో జన్మించిన శిశువుకు శస్త్రచికిత్స లేకుండా పూర్తిగా సమస్యను పరిష్కరించవచ్చన్నారు. పాన్సెట్టి పద్ధతి ద్వారా చికిత్స అందించవచ్చన్నారు. సమస్య జటిలంగా ఉంటే టినాటమి అనే చిన్న శస్త్రచికిత్స ద్వారా నయం చేయవచ్చన్నారు. చికిత్స అనంతరం ఫ్యాబ్ ఫుట్ అబ్‌డక్షన్ బ్రేస్ అనే ప్రత్యేక షూస్ చిన్నారులకు ధరింప చేసి తల్లిదండ్రుల ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించవచ్చన్నారు. తద్వారా పిల్లల పాదాలు సాధారణ స్థాయికి వచ్చి అందరిలాగే వారి భవిష్యత్తు బంగారమయమవుతుందన్నారు. ఈ సీఐఐటీ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ జీజీహెచ్‌లో 2017 నుంచి ఇప్పటి వరకు 249 మంది చిన్నారులకు చికిత్స అందజేసినట్లు చెప్పారు. సోమవారం మరో 22 మంది చిన్నారుల పేర్లు నమోదు చేసి చికిత్స అందజేస్తున్నామన్నారు. ఈ ప్రత్యేక వైద్య చికిత్సకు సంబంధించిన ఖర్చు అంతా సీఐఐటీ స్వచ్ఛంద సంస్థ భరిస్తుందన్నారు. వక్ర పాదాలతో జన్మించిన పిల్లలకు ప్రతి గురు, శుక్రవారాల్లో జీజీహెచ్ ఆర్థో విభాగంలో ప్రత్యేక వైద్య చికిత్స అందించనున్నట్లు చెప్పారు. ఎవరైనా వక్ర పాదాలతో బాధపడుతున్నట్లయితే ఆంధ్రప్రదేశ్ క్యూర్ క్లబ్ ఫుట్ సంస్థ హెల్ప్‌లైన్ నెంబర్ 8800020503లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్థో వైద్య నిపుణులు డా. ముఖర్జీ, డీసీఎస్ఆర్ఎంఓ డా.అనిత, క్యూర్ ఇండియా సంస్థ కోఆర్డినేటర్ ఎస్.కిరణ్‌రాయ్, ఆర్థో విభాగ పీజీలు పాల్గొన్నారు.



చికిత్సా శిబిరానికి హాజరైన చిన్నారులు, తల్లులు

చింత చిగురు ధర పైపైకి



కరప, జూన్ 3: వేసవికాలంలో దొరికే చింత చిగురును ఇష్టపడనివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఎన్నో ఔషధ గుణాలున్న ఈ చింత చిగురు ధర ఆకాశాన్నంటుతుంది. చింత చిగురు ధర ప్రస్తుతం చిటారు కొమ్మకు చేరడంతో ఆహార ప్రియులు దాన్ని కొనేందుకు జంకుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్‌గా కేజీ ధర రూ.400ల వరకు పలుకుతోంది. పట్టణ ప్రాంతాల్లో అయితే రూ.600ల వరకు ఉంటుందని వినియోగదారులు చెబుతున్నారు. చింత చిగురులో ఎక్కువ ప్రొటీన్లు, తక్కువ కొవ్వు పదార్థాలు కలిగి ఔషధ గుణాలు సమృద్ధిగా ఉండడంతో పాటు ఏ కూరలో వేసుకున్నా మంచి రుచిని కలిగిస్తుంది. అందుచేత చింత చిగురుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఏర్పడింది.

పూనమ్ చతుర్వేదికి బాహుబలి కాజా



రాజమహేంద్రవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో కెల్లా పొడవైన అమ్మాయి పూనమ్ చతుర్వేదికి సురుచి బాహుబలి కాజా సోమ వారం అందించారు. కోయంబత్తూరులో జరుగుతున్న బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌కు చెన్నై నుంచి వెళుతుండగా ఆమెను రాజ మహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో సురుచి పీఆర్‌వో వర్మ కలిసి కాజా, స్వీట్స్ అందించారు. పూనమ్ చతుర్వేది ఈస్ట్రన్ రైల్వే ఉద్యోగి, బాస్కెట్ బాల్ ప్లేయర్. ఆమె రైలు దిగడంతో ప్రయాణికులు ఆశ్చర్యంగా చూశారు. పలువురు ఆమెతో ఫొటో తీయించుకున్నారు.



అన్నదాన భవన నిర్మాణానికి
రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, జూన్ 3: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కలిదిండికి చెందిన మన్నె అశోక్‌గజపతిరాజు కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా సోమవారం ఒక్కరోజు ఆదాయం రూ.2,95871 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. వాడపల్లి వెంకన్న ఆలయానికి సోమవారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారని చెప్పారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారని ఆయన చెప్పారు.

ఒమ్మంగి యువకుడి హత్య కేసులో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు, జూన్ 3: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన యువకుడు మొగలి సతీష్ హత్య కేసులో నిందితులను సోమవారం స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్ఐ ఎం.పవన్‌కుమార్ విలేకరులకు అందించారు. ఒమ్మంగి గ్రామానికి చెందిన మొగలి సతీష్(33) మే 4న జ్యూస్ తాగి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అలా వెళ్లిన తన భర్త తిరిగి రాలేదని భార్య మొగలి విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే 4వ తేదీ రాత్రి ఒమ్మంగికి చెందిన బుర్రా దొరబాబు సతీష్‌ను ధర్మవరం గ్రామ శివారు పోలవరం కాలువ గట్టు వద్దకు రప్పించి ఒమ్మంగికి చెందిన గాడిదల లోవరాజు అనే వ్యక్తి సహాయంతో సతీష్‌ను ఇనుప రాడ్‌తో కొట్టి హత్య చేశాడు. అనంతరం లోవరాజు సహాయంతో సతీష్ మృతదేహాన్ని, సతీష్ బండిని ట్రాక్టర్‌పై వేసి ఉత్తరకంచి, పొదురుపాక పొలాల సరిహద్దుకు తరలించారు. దొరబాబు మామగారు అయిన వాయిలశెట్టి విశ్వనాథం సహాయంతో ఉత్తరకంచి పొదురుపాక సరిహద్దు సర్వే తోటల్లో గొయ్యి తీసి సతీష్ మృతదేహాన్ని పాతిపెట్టారు. అనంతరం సతీష్ మోటార్ బైక్‌ను ఎవరికీ అనుమానం రాకుండా మే 5వ తేదీ రాత్రి పెదమల్లాపురం గ్రామ శివారులో పెట్రోల్ పోసి దొరబాబును తగలబెట్టారు. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్న దొరబాబు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతి వద్ద లొంగిపోయి వ్యక్తిగత కక్షలతోనే తాను 4వ తేదీ రాత్రి మెగలి సతీష్‌ను హత్య చేసినట్లు చెప్పాడు. స్థానిక సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్ఐ ఎం.పవన్‌కుమార్, తహసీల్దార్ నరసింహారావు పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని పరిశీలించి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టంకు తరలించారు. ఈ కేసులో నిందితులైన బుర్రా దొరబాబు ఒమ్మంగిలోను, గాడిదల లోవరాజును రాచపల్లిలో అరెస్టు చేసి స్థానిక కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు తెలిపారు. దొరబాబుకు సహకరించిన అతని మామ వాయిలశెట్టి విశ్వనాథాన్ని అరెస్టు చేయాల్సి ఉందని అతని కోసం గాలింపు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మధ్యవర్తిత్వంలో న్యాయవాదులకు తర్ఫీదు

పీడీజే గంధం సునీత


వివరాలు వెల్లడిస్తున్న జడ్జి సునీత

రాజమహేంద్రవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాలకు చెందిన 30 మంది న్యాయవాదులకు 7వ తేదీ వరకూ మధ్యవర్తిత్వంలో తర్ఫీదు ఇస్తున్నామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఢిల్లీకి చెందిన సీనియర్ ట్రైనర్లు వినయ్ కుమార్ గుప్తా, సునీల్ కుమార్ అగర్వాల్ మొత్తం 40 గంటలపాటు శిక్షణ ఇస్తారన్నారు. సుప్రీంకోర్టు వారి మధ్యవర్తిత్వం, రాజీమార్గ పథక సంఘం(ఎంసీపీసీ), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మధ్యవర్తిత్వం వల్ల సమయం వృథా కాదని, త్వరితగతిన ప్రయోజనం చేకూరుతుందని ఆమె స్పష్టం చేశారు. ఖర్చులు లేకపోవడమే కాకుండా సామరస్య పూర్వకంగా కేసులు పరిష్కారం అవుతాయన్నారు.

ఏజెన్సీ సమాచారం

మన్యం ఓటరు తీర్పు ఎటో?

నేడే 'రంప' ఎన్నికల ఫలితాలు





(రంపచోడవరం): రంపచోడవరం ఎస్టీ రిజర్వుడు స్థానంలో తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవాన్ని తెచ్చుకుంటోందో లేక మళ్లీ విజయంతో వైసీపీ హ్యాట్రిక్ సాధిస్తుందో అన్న ఉత్కంఠకు నేడు తెరపడనున్నది. ముఖ్యంగా ఈ రెండు ప్రధాన పార్టీల విజయావకాశాలపై ఈ మారు సీపీఎం అభ్యర్థి ప్రభావం ఎలా ఉండబోతోందో అన్నది కూడా చర్చనీయాంశంగానే మారింది. రంపచోడవరం నియోజకవర్గం 1983 నుంచి తెలుగుదేశం వరుస విజయాలతో కంచుకోటగా మారింది. 2009లో కాంగ్రెస్ విజయం సాధించగా 2014, 2019లలో వైసీపీ వరుస విజయాలను సాధించింది. ఈ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం కొత్త అభ్యర్థి మిరియాల శిరీషాదేవిని బరిలో దించగా, వైసీపీ తన సిట్టింగ్ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిని కొనసాగించింది. వీరిద్దరితో పాటు ఇండియా కూటమిలో భాగమైన సీపీఎం అభ్యర్థిగా లోతా రామారావు, మరో 9 మంది బరిలో నిలిచారు. మన్యంలోనూ, రాష్ట్రంలోనూ చోటు చేసుకున్న అనేక పరిణామాలు వైసీపీని దెబ్బతీస్తాయని, తద్వారా వైసీపీ వ్యతిరేక ఓటు తమకు మళ్లుతుందని తెలుగుదేశం భావిస్తోంది. వైసీపీ అయితే ఈ సారి కూడా విజయం తమదేనని చెబుతోంది. కాగా ఈ రెండు పార్టీలు మన్యం ప్రజలను ముంచేశాయని, దీంతో ఈ రెండు పార్టీల వ్యతిరేక ఓట్లు అన్నీ తమ ఖాతాలో పడతాయని, ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు మూలంగా నష్టపోయిన వారు ఐదు మండలాలలో ఏకపక్షంగా తమవైపే నిలుస్తారన్నది సీపీఎం విశ్వాసం. మన్యంలో మారిన పరిస్థితులు, వైసీపీ వ్యతిరేక పవనాల నేపథ్యంలో సీపీఎం అభ్యర్థి బలంగా ఇక్కడ ఓట్లను చీల్చుతారన్న చర్చ కూడా విశ్లేషకుల్లో సాగుతోంది. అదే జరిగితే సీపీఎం అభ్యర్థికి వచ్చే ఓట్లు ఎవరి విజయావకాశాలను దెబ్బతీస్తాయోననే చర్చ నడుస్తోంది.

రంపచోడవరం నియోజకవర్గ కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

రంప అసెంబ్లీతో పాటు పార్లమెంట్ ఓట్ల లెక్కింపూ ఇక్కడే

2,08,025 ఓట్లు, 3,224 పోస్టల్ బ్యాలెట్లు

పోలీసు ఆధీనంలో రంపచోడవరం

లెక్కింపు కేంద్రం మార్గంలో షాపుల బంద్



లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం, జూన్ 3: రంపచోడవరంలో అసెంబ్లీ, అరకు పార్లమెంటుకు సంబంధించి ఈ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, రిటర్నింగ్ అధికారి ప్రశాంతకుమార్ మంగళవారం మీడియాకు వివరాలు అందించారు. ఈ నియోజకవర్గంలో 11 మండలాలలో అసెంబ్లీకి, పార్లమెంటుకు 2,08,025 మంది ఓటర్లు ఈవీఎంల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరే కాకుండా ఎన్నికల విధులలో ఉన్న ఈ నియోజకవర్గానికి చెందిన 3,224 మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 399 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి రంపచోడవరంలోని గిరిజన గురుకుల బాలికల విద్యాలయంలో లెక్కింపు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అసెంబ్లీకి, పార్లమెంటుకు వేర్వేరుగా లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 20 టేబుళ్ల చొప్పున ఒక్కో కేంద్రంలో 20 రౌండ్లుగా లెక్కిస్తారు. అసెంబ్లీకి సంబంధించి తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. అనంతరం ఈవీఎం ఓట్లను లెక్కిస్తారు. కాగా పార్లమెంటు విషయానికి వస్తే పార్లమెంటు పోస్టల్ బ్యాలెట్లను పార్వతీపురానికి పంపించివేశారు. అరకు పార్లమెంటులో అన్ని సెగ్మెంట్లకు సంబంధించి పోస్టల్ ఓట్లను అక్కడే లెక్కిస్తారు. రంపచోడవరం సెగ్మెంట్‌కు సంబంధించి పార్లమెంటు ఓట్లను నేరుగా ఈవీఎంలతోనే ప్రారంభిస్తారు. ఈ ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఆయా అభ్యర్థులు, వారి ప్రధాన ఏజెంట్లు, లెక్కింపు ఏజెంట్లు, గుర్తింపు పొందిన మీడియా ప్రతినిధులను మాత్రమే అనుమతిస్తున్నారు. ఇదిలా ఉండగా రంపచోడవరం మొత్తం పోలీసు ఆధీనంలోకి వెళ్లిపోయింది. ఓట్ల లెక్కింపు కేంద్రం రంపచోడవరంలోని డిగ్రీ కళాశాల వెనుక ఉండటంతో, రంపచోడవరం నుంచి అక్కడి వరకూ జన సంచారాన్ని కూడా నిషేధించారు. ముఖ్యంగా రంపచోడవరం ఏరియా ఆసుపత్రి నుంచి ఓట్ల లెక్కింపు కేంద్రం వరకూ అడుగడుగునా సాయుధ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫలితాల అనంతరం కూడా ఎటువంటి ఊరేగింపులకు, సంబరాలకు మంగళవారం అనుమతి లేదని పోలీసు అధికారులు స్పష్టం చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

వై.రామవరం, జూన్3: ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల ఫలితాలు సందర్భంగా సెక్షన్ 144 సీఆర్‌పీసీ, సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలులో ఉన్నందున నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ఒక చోట ఉండకూడని ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్‌ఐ సంతోష్‌కుమార్ మండల ప్రజలకు సూచించారు. ఆటోలు, జీపులు ఇతర ప్రైవేటు వాహనాల్లో జనాలను కౌంటింగ్ సెంటర్‌కు తీసుకువెళితే ఆయా వాహనాలను సీజ్ చేస్తామన్నారు. అలాగే బాణాసంచా కాల్చడం, బైక్ ర్యాలీలు, బైక్ సైలెన్సర్లు తీసేయడం వంటివి చేయరాదని హెచ్చరించారు. ఎన్నికల్లో గెలిచిన వారు ఓడిన వారి మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించరాదని సూచించారు.

విద్యుదుత్పత్తి లక్ష్యం 2,286.14 మిలియన్ యూనిట్లు

మోతుగూడెం, జూన్ 3: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని జల విద్యుత్ కేంద్రాలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి విద్యుదుత్పత్తి లక్ష్యం 2,286.14 మిలియన్ యూనిట్లుగా సెంట్రల్ విద్యుత్ అథారిటీ నిర్దేశించినట్లు స్థానిక ఏపీ జెన్‌కో అధికారులు తెలిపారు. ప్రతి ఏటా రాష్ట్రంలోని అన్ని జల విద్యుత్ కేంద్రాలకు సమకూరే నీటి వనరులు, జల విద్యుత్ కేంద్రం సామర్థ్యం ఆధారంగా కేంద్ర విద్యుత్ అథారిటీ అధికారులు విద్యుదుత్పత్తి లక్ష్యాలను నిర్ణయిస్తారు. ఈ నేపథ్యంలోనే సీలేరు కాంప్లెక్సు పరిధిలో నాలుగు జల విద్యుత్ కేంద్రాలు ఉండగా పొల్లూరు (లోయర్ సీలేరు) జల విద్యుత్ కేంద్రానికి 1,084 మిలియన్ యూనిట్లు, డొంకరాయి మినీ జల విద్యుత్ కేంద్రానికి 95.14సీలేరు (ఎగువ సీలేరు) జల విద్యుత్ కేంద్రానికి 477, మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి 630 మిలియన్ యూనిట్లు లక్ష్యంగా నిర్దేశిస్తూ ఏపీ జెన్‌కో కేంద్ర కార్యాలయం విజయవాడ (గుణదల) విద్యుత్ సౌదాకు పంపించడంతో జెన్‌కో ఉన్నతాధికారులు ఈ టార్గెట్ వివరాలను సీలేరు కాంప్లెక్సు పరిధిలోని జెన్‌కో కార్యాలయానికి పంపించినట్లు జెన్‌కో వర్గాల సమాచారం. గత ఏడాది విద్యుదుత్పత్తి లక్ష్యం 2,279.4 మిలియన్ యూనిట్లుగా నిర్దేశించారు. సీలేరు కాంప్లెక్సు పరిధిలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో బలిమెల పరీవాహక ప్రాంతంలో వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో కాంప్లెక్సు పరిధిలో ఒక్క మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం మాత్రమే నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోగా, పొల్లూరు, డొంకరాయి, సీలేరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని చేరుకోలేకపోయాయి. అయితే ఈ ఏడాది అధిక వర్షపాతం నమోదవుతుందన్న వాతావరణం శాఖ సూచనల మేరకు సీలేరు కాంప్లెక్సులోని నాలుగు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని మించి జరుగుతుందని స్థానిక జెన్‌కో అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాళ్లపూడి, జూన్ 3: మండల ఆర్య వైశ్య సంఘం, వాసవీ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 5న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు గోకవరపు బాబులు, కంకిపాటి సాయివినయ్ తెలిపారు. తాళ్లపూడి బస్టాండ్ వద్ద శ్రీవాసవీ ఆర్యవైశ్య సత్రంలో జరిగే ఈ శిబిరంలో కంటికి సంబంధించిన అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని చెప్పారు.

రౌండ్ రౌండ్‌కీ..

ఏ నియోజకవర్గం ఓట్లు ఎక్కడి నుంచి ..

రాజమహేంద్రవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకూ ఒక టెన్షన్. మంగళవారం ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు మొదలైన తర్వాత మరో టెన్షన్. ఏ రౌండ్‌లో ఎవరికి మెజార్టీ వస్తుందనే టెన్షన్ ఉంటుంది. కానీ ఆయా నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులకు, అభ్యర్థులకు మాత్రం ఏ రౌండ్‌లో ఏ మేరకు ఓట్లు వస్తాయో ఓ మాదిరిగా అంచనా వేసేయగలుగుతారు. ఎందుకంటే పోలింగ్‌స్టేషన్ల వారీ ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఓట్ల లెక్కింపునకు ఒక్కో నియోజకవర్గానికి ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపునకు 14టేబుళ్ల వంతున ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. పార్లమెంట్ ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్ల ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు వేరే టేబుళ్ల ఏర్పాటు చేశారు. ప్రతీ రౌండ్‌లోనూ 14 పోలింగ్ స్టేషన్లలో నమోదైన ఓట్లను లెక్కిస్తారు. తర్వాత మరో 14పోలింగ్‌బూత్‌ల ఓట్లు లెక్కిస్తారు. ఇలా మొత్తం లెక్కింపు పూర్తయ్యేవరకూ ప్రక్రియ కొనసాగుతుంది. ప్రతి నియోజకవర్గం నుంచి మొదటి రౌండ్‌లో 1నుంచి 14వ పోలింగ్‌బూత్ వరకూ నమోదైన ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. దీనిని బట్టి ఆయా ప్రాంతాల్లో అవగాహన ఉన్నవారికి ఓ అంచనా అందేస్తుంది. ఓ రౌండ్‌లో ఓ అభ్యర్థి మెజార్టీ వస్తే, వచ్చే రౌండ్‌లో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తాయో కూడా చెప్పేసే లెక్కలు చాలా మంది వద్ద ఉంటాయి. కౌంటింగ్ ఏ పోలింగ్ స్టేషన్ నుంచి మొదలవుతుంది. ఏ రౌండ్‌లో ఏయే గ్రామాలు, ఏయే ప్రాంతాలు కవరవుతాయనే సమాచారం ముందుగానే వారి దగ్గర పెట్టుకుంటారు. ఏ బూత్‌లో ఎన్ని ఓట్లు పోలయ్యాయో కూడా వివరాలు సేకరించుకుంటారు. దీంతో ప్రతీ రౌండ్‌కు అంచనా ఉంటుంది. కానీ ప్రజలందరూ ఓట్లు ఎలా వేస్తారనేది చెప్పలేకపోవచ్చు. కానీ ఆయా ప్రాంతాల్లో ఓటర్ల నాడి ముందుగానే వాళ్లకు తెలుస్తుంది కాబట్టి, ఆయా రౌండ్లలో ఆయా అభ్యర్థులకు మెజార్టీ ఎంత అనేది కూడా అంచనా వేస్తారు. జిల్లాలో మొత్తం 1577 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. అసెంబ్లీ ఓట్లతోపాటు, పార్లమెంట్ ఓట్లను కూడా సమాంతరంగా లెక్కిస్తారు.

- అనపర్తిలో 228 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇక్కడ 17రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. అనపర్తిలోని 1వ బూత్ నుంచి లెక్కింపు మొదలవుతుంది. మొదట రౌండ్‌లో 1నుంచి 14వ పోలింగ్‌స్టేషన్లలోని ఈవీఎంలలో ఓట్లను లెక్కిస్తారు. తర్వాత బిక్కవోలు, రంగంపేట మండలాల ఓట్లు లెక్కించి, చివరిగా పెదపూడి మండలంలోని ఓట్లు లెక్కిస్తారు. కరకుదురు గ్రామంలోని ఓట్ల లెక్కింపుతో మొత్తం ఫలితం వెల్లడవుతుంది.
- రాజానగరంలో 216 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయి. ఇక్కడ 16 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. మొదట రౌండ్ సీతానగరం మండలంలో 1 నుంచి 14వ పోలింగ్‌బూత్‌ల నుంచి మొదలవుతుంది. తర్వాత కోరుకొండ మండ లంలోని ఓట్లు లెక్కిస్తారు. చివరిగా రాజానగరం మండలంలోని ముక్కినాడ పాకలు గ్రామంలో ఓట్లు లెక్కిస్తారు.
- రాజమహేంద్రవరం సిటీలో 237 పోలింగ్ కేంద్రాలున్నాయి. 17 రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుంది. సిటీలో మొదట శ్రీరాంనగర్, ఆనందనగర్, రాందాసుపేట, సుబ్బారావునగర్‌లోని క్వారీపేట ఓట్లు లెక్కిస్తారు. తర్వాత సుబ్బారావునగర్, సిద్ధార్థనగర్, సంజీవయ్యనగర్, బర్మా కాలనీలోని ఓట్లను లెక్కిస్తారు. చివరిగా బ్రాడీపేట, అంబేద్కర్‌నగర్‌లోని ఓట్లను లెక్కిస్తారు.
- రాజమహేంద్రవరం రూరల్‌లో 267పోలింగ్ కేంద్రాలున్నాయి. 20 రౌండ్లలో ఇక్కడ లెక్కింపు పూర్తవుతుంది. తొర్రేడు, వెంకటనగరం, కాతేరు, ప్రాంతాల్లోని ఓట్లను లెక్కిస్తారు. రెండో రౌండ్‌లో కాతేరు, కోలమూరు, కొంతమూరులో కొంత భాగం లెక్కిస్తారు. తర్వాత రాయుడుపాకల, మోరంపూడి, హౌ కుంపేట, సాటిలైట్‌సిటీ, బొమ్మూరు, రాజోలు, ధవళేశ్వరం గ్రామాల ఓట్లు లెక్కింపు అనంతరం రూరల్ నియోజకవర్గ పరిధిలోని రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలోని 8 డివిజన్ల ఓట్లు లెక్కిస్తారు. చివరిగా కడియం మండలంలోని మాధవరాయుడుపాలెంలోని ఓట్లను లెక్కిస్తారు.
- కొవ్వూరులో 176 పోలింగ్ కేంద్రాలున్నాయి. 13 రౌండ్లలో ఇక్కడ లెక్కింపు పూర్తవుతుంది. తాళ్లపూడి మండలంలోని తాడిపూడి 1వ బూత్ నుంచి ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. వరుసగా కొవ్వూరు మండలంలోని కొన్ని గ్రామా లు, మున్సిపాల్టీ వార్డులు, చాగల్లు మండలం, తిరిగి కొవ్వూరు మండలంలో చివరిగా మద్దూరు లంక ఓట్లను లెక్కిస్తారు.
- నిడదవోలులో 205 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇక్కడ 15రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుంది. నిడదవోలు మండలం కోరుమామిడి నుంచి ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. తాడిమళ్ల, ఉనకరమిల్లి, కాటకోటేశ్వరం, సూరాపురం, తిమ్మరాజుపాలెం, తర్వాత నిడదవోలు టౌన్ ఓట్లు, మండలంలోని ఓట్లు లెక్కించాక ఉండ్రాజవరం మండలంలోని ఓట్లను లెక్కిస్తారు. చివరిగా పెరవలి మండలం పిట్టలవేమవరంలోని కడింపాడు ఓట్లను లెక్కిస్తారు.
- గోపాలపురంలో 248 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇక్కడ 18 రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుంది. గోపాలపురం మండలంలోని కరగపాడు నుంచి ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. ఈ మండలంలోని గ్రామాలు పూర్తయిన తర్వాత దేవరపల్లి మండలం, తదుపరి నల్లజర్ల మండలం, ద్వారకా తిరుమల మండలాల్లో లెక్కింపు జరుగుతుంది. చివరిగా పికన్నాపురం శివారు సత్తాల ఓట్లు లెక్కిస్తారు.



ఓట్ల లెక్కింపునకు నన్నయ యూనివర్శిటీలో ఏర్పాట్లు

కాలువలా!.. డంపింగ్ యార్డులా!

- కాలువగట్టున చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు
- కలుషితమవుతున్న నీరు
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు



కడియం-వేమగిరి కాలువ గట్టుపై వేసిన చెత్తాచెదారం

కడియం, జూన్ 3: పండుగలు, పబ్బాలతో పాటు అయ్యప్ప, భవానీ మాలధారణ చేసిన భక్తులు, శ్రావణ మాసం, మాఘమాసం వంటి నెలల్లో మహిళలు పవిత్ర గోదావరి నీటిలో స్నానం ఆచరిస్తే ఎంతో పుణ్యమొస్తుంది. అంతేకాదు సకల దోషాలు పోతాయనేది ప్రజల నమ్మకం. ప్రస్తుతం పుణ్యస్నానాల మాట ఎలా ఉన్నా గోదావరి నీటిలో స్నానం చేస్తే రోగాలు వస్తాయనేది ప్రజలను వెంటాడుతున్న భయం. కాలువలను పరిరక్షించాల్సిన అధికారులు వాటి జోలికి పోరు. ఇక ఆయా పంచాయతీ అధికారులు సైతం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ధవళేశ్వరం గోదావరి నుంచి విడుదల చేసిన నీరు కాలువల ద్వారా వేమగిరి, కడియం, కేశవరం, ద్వారపూడి, అనపర్తి, బలభద్రపురం, బిక్కవోలు, సామర్లకోట వరకు ప్రవహిస్తోంది. దానిని పంట పొలాలకు, పశువులకు దాహార్తి తీర్చేందుకు, పుణ్యస్నానాలకు వాడేవారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో ఉన్న చెత్త, చెదారం, ఖాళీ కొబ్బరిబొండాలు, తాగి పాడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ సంచులు, కోడి వ్యర్థాలు ఇలా ఒకటేమిటి అన్నీ కాలువలో వేయడంతో మురికి కూపాలుగా మారుతున్నాయి.. కాలవగట్టునే చెత్త డంప్ చేయడం, వాటిని తగలబెడుతుండడంతో ఆ మార్గాల్లో ప్రయాణించే వారు ఆ గాలి పీల్చి రోగాల బారిన పడుతున్నారు. ఇలా కాలువలు కలుషితం అవుతున్నా, కాలువగట్టుపైనే వ్యర్థాలు వేస్తున్నా అటు ఇరిగేషన్, ఇటు పంచాయతీల అధికారులు కూడా తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి కాలువలకు పూర్వవైభవం తీసుకురావాలని కోరుతున్నారు.



కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన



సిటీ కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న పరిశీలకుడు సుబ్రహ్మణ్యం, జిల్లా ఆర్వో మాధవీలత, సిటీ ఆర్వో దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 3: రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ ఏర్పాట్లను సోమవారం ఎన్నికల కౌటింగ్ పరిశీలకుడు ఎం.సుబ్రహ్మణ్యంతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత పరిశీలించారు. నన్నయ్య యూనివర్శిటి ఆవరణలో రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ కౌంటింగ్ హాలును పరిశీలించారు. అక్కడ చేసిన ఏర్పాట్లను ఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ వివరించారు. మాధవీలత మాట్లాడుతూ రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం పరిధిలో ఈవీఎంల ద్వారా పోలైన ఓట్లు, ఎన్ బ్లాక్ -ఈస్ట్ వింగ్‌లో లెక్కిస్తారన్నారు. ఇప్పటికే కౌంటింగ్ అధికారులకు, సిబ్బందికి రెండు దశల్లో శిక్షణ ఇచ్చామన్నారు. రెండు సార్లు ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బందిని కేటాయించామన్నారు. మంగళవారం ఉదయం 5:30 గంటలకు కౌంటింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ద్వారా టేబుల్స్ కేటాయిస్తామని తెలిపారు. వారి వెంట సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్ తదితరులున్నారు.

పాముకాటుకు గురైన ఉపాధికూలీ

కడియం, జూన్ 3: కడియం మండలం మాధవరాయుడుపాలెం గ్రామానకి చెందిన ఉపాధిహామీ కూలీ చోడువాడ దేవుడమ్మ పనిచేస్తుండగా పాముకాటుకు గురైంది. వెంటనే ఆమెను కడియం పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ సుధాకర్

కొవ్వూరు, జూన్ 3: ఆగివున్న లారీని ఢీకొని మోటారుసైకిలిస్టు మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. కొవ్వూరు మండలం కాపవరం ఎక్స్‌ప్రెస్ హైవేలో ఫ్లైఓవర్ వద్ద మచిలీపట్నం నుంచి రాజానగరం వెళ్తున్న లారీ బ్రేక్ డౌన్ అయ్యింది. జంగారెడ్డిగూడెం నుంచి రంగంపేట మండలం వడిశలేరు బైక్‌పై వెళ్తున్న సోమిశెట్టి సత్యనారాయణ అలియాస్ బుజ్జి(50) ఆగివున్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో ఎస్ఐ సుధాకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని విరాలు సేకరించారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పరిశోధనకు నూతన వరి విత్తనాలు పంపిణీ

- జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ నరసింహారావు
- పలుచోట్ల రైతులకు అందజేత



రైతులకు వరి విత్తనాలను అందిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు

దివాన్‌చెరువు, జూన్ 3: పరిశోధన నిమిత్తం నూతన వరి రకాల విత్తనాలను రైతులకు అందజేసినట్టు జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాళ్లపూడి, నల్లజర్ల, దేవరపల్లి, కొవ్వూరు, రాజమహేంద్రవరం రూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో పరిశోధన నిమిత్తం వరిలో కొత్తరకాల విత్తనాలను అందజేశామన్నారు. ప్రస్తుత సార్వా సీజనులో వరిలో నూతన వంగడాలైన ఎంటీయూ-1271, 1275, 1310, బీపీటీ-3082, 2858, 2841 వంటి రకాలను రైతుల కమతాల్లో పరీక్ష చేసి వాటి దిగుబడి, నాణ్యత, చీడపీడలను తట్టుకునే సామర్థ్యం వంటి లక్షణాలను స్థానికంగా రైతులు వేస్తున్న ఎంటీయూ-7029, బీపీటీ-5204 వంటి రకాలతో పోల్చుతామన్నారు. రైతులు నారుమడులు పోసుకునే సమయంలోపే వాటిని అందజేశామని తెలిపారు. ఈ సార్వాకు సంబంధించిన రైతుల కమతాల్లో ప్రయోగాలకు శ్రీకారం చుట్టామని నరసింహారావు పేర్కొన్నారు. రైతుల దిగుబడులను పెంచే దిశగా పరిశోధనలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం మరో ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ ఎస్.హైమజ్యోతి తదితరులు పాల్గొన్నారన్నారు.

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురంలో రైతుభరోసా కేంద్రం వద్దకు జిల్లా ఏరువాక జిల్లా కేంద్రం కోఆర్డినేటర్ నరసింహరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో సార్వా వ్యవసాయం చేపట్టే రైతులకు కొన్ని కొత్త వరి వంగడాలను పరిచయం చేసే కార్యక్రమం చేపట్టారు. దిగుబడి, నాణ్యత, వాతావరణం, చీడపీడలను తట్టుకునే ఎంటీయూ-1271, 1310, 1235, బీపీటీ-3082, 2585, 2841 వంటి వరి విత్తనాల గురించి వివరించారు. గతంలో ఉండే ఎంటీయూ-7029, బీపీటీ-5204 విత్తనాలతో పోలిస్తే ఇవి మెరుగైన విత్తనాలుగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొన్ని రకాల విత్తనాలను కొత్త రకాల విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. నారుమడులు కట్టుకునే సమయానికి విత్తనాలను పూర్తిగా సరఫరా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త హేమజ్యోతి, మండల వ్యవసాయాధికారిణి రుచిత, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటలతో మనోవికాసం



ఎస్‌కేవీటీ కాలేజీ బాస్కెట్‌బాల్ సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 3: మానసికోల్లాసానికి, మనోవికాసానికి క్రీడలు ప్రధాన భూమిక వహిస్తాయని ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల సమ్మర్ క్యాంపు అధ్యక్షుడు దొండపాటి శంకర్రావు అన్నారు. కళాశాలలో సోమవారం బాస్కెట్‌బాల్ ఉచిత సమ్మర్ క్యాంపు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి జీవితం గెలుపు ఓటములతో ముడిపడి ఉంటుందన్నారు. సమ్మర్ క్యాంపులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ జగన్ ఎలక్ట్రానిక్స్ అధినేత ఎస్.మూర్తి అందజేశారు. కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వరరావు, కె.బుజ్జి, సిరా గంగాధరరావు, పీఏ కిషోర్‌బాబు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాగ్గేయకారుల దాస సాహిత్య కీర్తనలపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న పరిమళ, జ్యోత్స్నలక్ష్మి, వైష్ణవి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 3: రాజమహేంద్రవరం టీటీడీ కల్యాణ మండపంలో తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఉచితంగా వాగ్గేయకారుల దాస సాహిత్య కీర్తనలు శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. వాగ్గేయకారుల దాస సాహిత్య కీర్తనలపై మంచిరాజు హేమలత భజనమండలి పర్యవేక్షణలో కర్నూల నుంచి వచ్చిన ఆర్‌జె పరిమళ, హైదరాబాద్ నుంచి వచ్చిన జ్యోత్స్నలక్ష్మి, రాయచూర్ నుంచి వచ్చిన పల్లవి అశ్విత్, బెంగళూరు నుంచి వచ్చిన వైష్ణవి సోమవారం శిక్షణ ఇచ్చారు. అనంతరం పసుమర్తి శ్రీనివాసశర్మ శిష్యబృందం ఏ.అక్షయ, బి.తేజశ్వి, జి.పల్లవి, జె.జాహ్నవి, ఎస్.యామిని, జె.చాతుర్య, ఎ.వసుంధర, ఎస్.అక్షయ, బ్రాహ్మంజలి దశావతారాలు, తరంగం, రామదాసు, అన్నమయ్య కీర్తనలను అభినయించారు.

ఏజెంట్లు భావోద్వేగాలకు లోనవ్వొద్దు

అనపర్తి కూటమి అభ్యర్థి నల్లమిల్లి



కౌంటింగ్ ఏజెంట్ల సమావేశంలో సూచనలిస్తున్న నల్లమిల్లి

అనపర్తి, జూన్ 3: కూటమి ఏజెంట్లు కౌంటింగ్ హాల్లో ఎటువంటి భావో ద్వేగాలకు లోను కావద్దని, ఇబ్బంది ఏర్పడితే ఆర్వోకు ఫిర్యాదు చేయాలని నియోజకవర్గ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని రామవరంలో కౌంటింగ్ ఏజెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటమి భయంతో వైసీపీ ఏజెంట్లు కవ్వింపులకు పాల్పడే అవకాశముందని మన ఏజెంట్లు సంయమనంతో ఉండాలన్నారు. ఫలితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అనుమానం కలిగితే ఆర్వోకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో తమలంపూడి సుధాకర్‌రెడ్డి, పడాల వెంకటరామారెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, వాసు, రావాడ నాగు పాల్గొన్నారు.

నల్లమిల్లి విజయాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థి రామకృష్ణారెడ్డి భారీ విజయం సాధించాలని కాంక్షిస్తూ రామవరంలో నియోజకవర్గ పాస్టర్స్ ముస్లింల ఆధ్వ ర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ విజయరావు, మైనారిటీ నాయకుడు షేక్ దరియా సాహేబ్ ప్రార్థనలు నిర్వహించి నల్లమిల్లికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వివిధ గ్రామాల నుంచి టీడీపీ, బీజేపీ నాయకులు నల్లమిల్లి నివాసానికి చేరుకుని ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.

అనంతేశ్వరుడికి అన్నాభిషేకం




కడియం, జూన్ 3: కడియపులంకలో అపర్ణ సమేత అనంతేశ్వరస్వామి పంచాయతన దివ్యక్షేత్రం వార్షికోత్సవం ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగింది. స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అపర్ణాదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అనంతేశ్వరునికి మహా అన్నాభిషేకం చేశారు. ఈ అభిషేక ప్రసాదంతో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అనంతేశ్వరునికి అన్నాభిషేకం చేస్తున్న దృశ్యం

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: గంగం గణేశా
సూర్యామినీ	: మిస్టర్ అండ్ మిసెస్ మహి
సూర్యాప్యాలస్	: భజే వాయువేగం
స్వామి	: భజే వాయువేగం
శివజ్యోతి	: లవ్ మీ
అనుశ్రీ(సాయికృష్ణ)	: హిట్‌లిస్ట్
రాజా	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
ఊర్వశి	: ఆ ఒక్కటీ అడక్కు
రంభ	: రాజుయాదవ్
మేనక	: బాక్
అప్సర	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
వీఎస్ మహల్(నామవరం)	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
వెంకటసూర్య(కడియం)	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
సత్యగౌరి (అనపర్తి)	: బాక్
సూర్యశ్రీ (అనపర్తి)	: ఆ ఒక్కటీ అడక్కు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
రామకృష్ణ(కోరుకొండ)	:
గీతాసినిమాస్ (సీతానగరం)	:
శ్రీనివాస (గోకవరం)	: కృష్ణమ్మ
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
లలితామహల్(రంపచోడవరం)	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
నవయుగ(చింతూరు)	: ఆ ఒక్కటీ అడక్కు


ఏ నియోజకవర్గం ఎక్కడ నుంచి.. 8



అ..టెన్షన్!

నేడే ప్రజా తీర్పు

అంతటా అటెన్షన్.. ఒక వైపు అభ్యర్థులు.. మరో వైపు అధికారులు అందరిలోనూ టెన్షన్.. టెన్షన్.. ఎందుకంటే నేడే ఓటరు తీర్పురానుంది.. ఈ నేపథ్యంలో అటు పల్లెలు..ఇటు గ్రామాల్లోనూ ఏం జరుగుతుందో.. ఏమవుతుందో..ఫలితం ఎలా ఉంటుందోననే చర్చ సాగుతోంది. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కూటమికి అనుకూలంగా ఉన్నా టెన్షన్ మాత్రం తగ్గలేదు. మరో వైపు కూటమి అభ్యర్థుల్లో గెలుపు ధీమా కనిపిస్తుంటే.. వైసీపీ అభ్యర్థులు మాత్రం డీలాగా ఉన్నారు. ఏదేమైతేనేం మరి కొద్ది గంటల్లోనే విజేతలెవరో.. పరాజితులెవరో తేలిపోనుంది. రాబోయే ఐదేళ్ల పాటు మన ఎమ్మెల్యేలు..ఎంపీ ఎవరో స్పష్టమైపోతోంది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఆరంభిస్తారు. సరిగ్గా 22 రోజుల కిందట మే 13వ తేదీన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సాగింది.. ఓటరు తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది.. మరికొద్ది గంటల్లోనే ఫలితం తేలనుండడంతో అందరిలోనూ భరించలేని టెన్షన్ నెలకొంది. జిల్లాలోని రాజమహేంద్రవరం పార్లమెంట్, రాజమహేంద్రవరం సిటీ, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఆయా నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్‌చెరువులోని ఆదికవి నన్నయ వర్సిటీలో స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచారు. ఆ ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను మంగళవారం ఉదయం నుంచి అక్కడే లెక్కిస్తారు.

- (రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- ఉత్కంఠకు నేటితో తెర
- ఉదయం 8 నుంచే కౌంటింగ్
- జిల్లాలో ఓటర్లు 16,23,149
- ఓటేసిన వారు 13,13,645
- ఓటింగ్ 80.93 శాతంగా నమోదు
- 13 రౌండ్లలోనే తొలి ఫలితం కొవ్వూరు
- 20 రౌండ్లలో చివరిగా రాజమండ్రి రూరల్
- ఇదే సమయంలో పార్లమెంట్ ఫలితం





నన్నయ వర్సిటీ మెయిన్‌గేట్ ఎదుట పాస్‌లు పరిశీలిస్తున్న పోలీసులు

ఏ ఫలితం ఎప్పుడంటే..

కొవ్వూరు ఎస్సీ నియోజకవర్గంలో 13 రౌండ్లు లెక్కిస్తారు. మొదట ఫలి తం ఇదే వెల్లడవుతుంది. రాష్ట్రంలోనే ఇది తొలి ఫలితం అయ్యే అవకాశం ఉంది. దాంతో పాటు ఈ నియోజకవ ర్గంలో ఎంపీ అభ్యర్థులకు ఎన్ని ఓట్లు వచ్చాయో కూడా తేలిపోతుంది..నిడదవోలు నియోజకవర్గం ఓట్లను 15 రౌండ్లలో లెక్కిస్తారు. అందు వల్ల ఇది జిల్లాలో రెండో ఫలితం అవుతుంది. రాజానగరం ఓట్లను 16 రౌండ్లలో లెక్కిస్తారు. ఇది మూడో ఫలితం అవుతుంది. అనపర్తి, రాజమహేంద్రవరం సిటీ ఓట్లను ఒక్కొక్కటి 17 రౌండ్లలో లెక్కిస్తారు. ఇవి జిల్లాలో నాలుగో ఫలితంగా వెలువడవచ్చు. గోపాలపురం ఓట్లను 18 రౌండ్లలో లెక్కిస్తారు. ఇది జిల్లాలో ఐదో ఫలితంగా వెలువ డుతుంది. చివరగా రాజమహేంద్రవరం రూరల్ ఓట్లను 20 రౌండ్లలో లెక్కిస్తారు. ఇది చివరి ఫలితం అవుతుంది. దీంతో పాటు పార్లమెంట్ అభ్యర్థి ఫలితం ప్రకటిస్తారు. మొదటి ఫలితం 12 గంటల లోపు..చివరి ఫలితం మధ్యాహ్నం 2గంటలకు వెలువడే అవకాశం ఉంది.


కౌంటింగ్ కేంద్రం



లెక్కింపు సాగుతుందిలా..

17 కౌంటింగ్ సెంటర్లు ఏర్పాటు చేయగా ఒక్కో సెంటరులో 14 టేబుళ్ల వంతున ఏర్పాటు చేశారు. జిల్లాలో 1577 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటిని మొత్తం 98 టేబుళ్ల పరిధిలో 116 రౌం డ్లలో లెక్కిస్తారు. జిల్లాలో ఈటీపీబీ ఓటర్లు 405 మంది, పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు 15,383 మంది ఉన్నారు. జిల్లాలో మొత్తం 16,23,149మంది ఓటర్లు ఉండగా 13,13,645 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది 80. 93 శాతం. ఓట్ల లెక్కింపులో ఈవీఎంలలో ఓట్లను, పోస్టల్ బ్యాలెట్, హోంబ్యాలెట్ ఓట్లు, సర్వీసు ఓట్లను వేర్వేరు టేబుళ్ల మీద లెక్కించనున్నారు. మొదటి, రెండో రౌండ్ ఓట్ల లెక్కింపునకు గంట పడుతుంది. మూడో రౌండ్ నుంచి 20 నిమిషాల్లోపే పూర్తవుతుంది. మొదటగా పోస్ట ల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు పూర్తవుతుంది. ఒక్కో రౌండ్‌కు మూడు గంటలు పడుతుంది. అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు చెందిన ఓట్లను ఒకేసారి లెక్కించడం వల్ల ఏ రౌండ్ ఫలితం ఏంటనేది వెంటనే తెలిసిపోతుంది. కానీ పార్లమెంట్ ఫలితం మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లు లెక్కింపు తర్వాతే తేలుతుంది.

ఆ 2 కి.మీ నిషేధం

రాకపోకలు బంద్

జిల్లాలో ఓట్ల లెక్కింపు మంగళవారం నన్నయ వర్శిటీలో జరగనున్న నేపథ్యంలో రాజానగరం, దివాన్‌చెరువు గ్రామాల మధ్యలో హైవే రాకపోకలపై నిషేధాజ్ఞలు విధించారు. యూనివర్సిటీకి 2 కిలోమీటర్ల దూరం వరకూ నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయి. ఎన్నికల డ్యూటీ ఉన్నవారిని తప్ప ఇతరులను అనుమతించరు. దివాన్‌చెరువు గ్రామంలో మంగళవారం దుకాణాలకు బంద్ ప్రకటించారు. ఆర్టీసీ బస్సులను ట్రాఫిక్ మళ్లించారు. రాజమండ్రి నుంచి విశాఖ వెళ్లే బస్సులు కొంతమూరు, ఎయిర్‌పోర్టు, బూరుగుపూడి, దోసకాయలపల్లి, నందరాడ, నరేంద్రపురం మీదుగా రాజానగరం జంక్షన్ నుంచి జాతీయ రహదారికి వెళతాయి. విశాఖ నుంచి రాజమహేంద్రవరం, విజయవాడ వైపు వెళ్లే బస్సులు తిరిగే అదే రూట్‌లో వస్తాయి. రాజానగరం దుర్గమ్మ గుడి జంక్షన్ నుంచి వాహనాలకు అనుమతి లేదు. దివాన్‌చెరువు నుంచి కౌంటింగ్ సెంటర్ వైపు కూడా ఇతర వాహనాలకు అనుమతి లేదు.

అత్యవసర సర్వీసులకు రైట్ రైట్

దేవరపల్లిలో గూడ్స్ వాహనాలను ఉదయం 4 గంటల నుంచి నిలిపివేస్తారు. ఉదయం 9 గంటల తర్వాత పరిస్థితిని బట్టి నెమ్మ దిగా ఒక్కో వాహనాన్నీ వదులుతారు. పాలు, మందులు, కూరగా యలు వంటి వాహనాలను ఆపరు. అత్యవసర సర్వీసులను అడ్డుకోరు.అంబులెన్సులు, ఆస్పత్రులకు వెళ్లే వాహనాలకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఒకవేళ ఇబ్బంది ఏర్పడితే పోలీస్ కంట్రోల్ రూం డయల్ 100/112కి ఫోన్ చేయవచ్చు.

గెలిచేదెవరో.. ఓడేదెవరో!

బరిలో 83 మంది అభ్యర్థులు

పోలింగ్ జరిగిన సరళి,ఎగ్జిట్ పోల్ సర్వేలు అంచనాల ప్రకారం జిల్లాలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులే విజయకేతనం ఎగరవేసే అవకాశం ఉంది. ఆ జోష్ కూటమి అభ్యర్థుల్లో కనిపిస్తోంది. జిల్లాలో రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఏడు నియోజకవర్గాలు ఉన్న సంగతి తెలిసిందే. వీటి పరిధిలో మొత్తం 83 మంది అభ్యర్థులు పోటీ చేశారు.7 అసెంబ్లీల పరిధిలో 71 మంది పోటీపడగా 59 మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్న సంగతి తెలిసిందే.కానీ పోటీ ప్రధానంగా కూటమి, వైసీపీ మధ్యే ఉంది. రాజమహేంద్రవరం లోక్‌సభ నుంచి కూటమి తరపున బీజేపీ రాష్ట్ర అధ్యక్షు రాలు, ఎన్టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేసిన సంగతి తెలిసిందే.ఆమె గెలుపు ధీమాతో ఉన్నారు. ఆమెకు పోటీగా వైసీపీ అభ్యర్థిగా డా.గూడూరి శ్రీనివాసరావు,కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పోటీపడ్డారు.ఈ పార్లమెంట్ స్థానం నుంచి మొత్తం 12 మంది బరిలో నిలిచారు.

తొలిసారి.. బరిలో వీరు..

జిల్లాలో తొలిసారి కూటమి తరపున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న నేతలు ఉత్సాహంగా ఉన్నారు. సర్వేలు కూడా వారికి అనుకూలంగా ఉన్నాయి. రాజమహేంద్రవరంసిటీ నుంచి ఆదిరెడ్డి వాసు తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. గత ఎన్నికల్లో ఆయన సతీమణి ఆదిరెడ్డి భవానీ ఇక్కడ నుంచి గెలిచి ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈసారి టీడీపీ ఆయనకు టికెట్ ఇవ్వడంతో పోటీ చేశారు.రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణ కూడా తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేశారు.గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకట్రాజు కూడా తొలిసారే పోటీ చేశారు.

ఆ ముగ్గురిపై అంచనాలు..

ఈ సారి జిల్లాలో తొలిసారిగా జనసేన నుంచి కందుల దుర్గేష్‌బత్తుల బలరామకృష్ణ విజయకేతనం ఎగరవేస్తారనే అంచనాలు ఉన్నాయి. అవి మంగళవారం మధ్యాహ్నానికి స్పష్టమవుతుంది.నిడదవోలు నుంచి జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణ జనసేన నుంచి కూటమి అభ్యర్థిగా పోటీపడ్డారు.అనపర్తి నుంచి టీడీపీ సీనియర్ నేత, నల్లమిల్లి రామ కృష్ణారెడ్డి ఈసారి పొత్తు నేపథ్యంలో బీజేపీ అభ్యర్థిగా కూటమి తరపున పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఆయనకు బీజేపీ కలిసి వస్తుందని, విజయకేతనం ఎగరవేస్తారనే అంచనాలు న్నాయి. గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావు కూడా కొవ్వూరు నుంచి తొలిసారిగా పోటీ చేశారు.వీరంతా గెలుపు ధీమాతో ఉన్నారు.

గోరంట్ల ఏడో సారి?

రాజమహేంద్రవరం రూరల్ నుంచి సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఏడోసారి అసెంబ్లీకి వెళతానని చెబుతున్నారు. ఏడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికై జిల్లాలో రికార్డు సాధిస్తానని అంటున్నారు. నియోజకవర్గంలో టీడీపీ, జనసేన,బీజేపీ కూటమిగా ఏర్పడడం వల్ల ఆయనకు మంచి ఫలితాలు రానున్నాయి.

మంత్రుల సంగతేంటో?

జిల్లాలో రాజ్యమేలిన మంత్రులు తానేటి వనిత, చెల్లుబోయిన వేణు తమ అదృష్టాన్ని మరోసారి పరీక్షించు కుంటున్నారు. వాస్తవానికి తానేటి వనిత గత ఎన్నికల్లో కొవ్వూరు నుంచి పోటీ చేసి గెలవగా, ఈసారి గోపాల పురం నుంచి బరిలో దిగారు. చెల్లుబోయిన వేణు గత ఎన్నికల్లో రామచంద్రపురం నుంచి పోటీ చేసి గెలవగా ఈసారి రాజమహేంద్రవరం రూరల్ నుంచి పోటీపడ్డారు. ఈ సారి కొత్తగా వైద్య వృత్తి నుంచి వచ్చిన గూడూరి శ్రీనివాసరావు వైసీపీ నుంచి లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసిన సంగతి తెలిసిందే. రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపీ మార్గాని భరత్ పోటీ చేశారు. గత ఎన్నికల్లో ఎంపీగా గెలిచి ఆయన ఈ సారి ఎమ్మెల్యేగా పోటీపడ్డారు. ప్రస్తుత గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెం కట్రావు కొవ్వూరు నుంచి పోటీపడ్డారు.ప్రస్తుత ఎమ్మెల్యేలు రాజానగరం నుంచి జక్కంపూడి రాజా, అనపర్తి నుంచి సత్తి సూర్యనారాయణరెడ్డి, నిడదవోలు నుంచి జి.శ్రీనివాసనాయుడు తిరిగి పోటీ చేసిన సంగతి తెలిసిందే. నిశ్శబ్ద విప్లవం మాదిరిగా సైలెంట్‌గా జరిగిన ఓటింగ్‌తో వీరంతా కంగారు పడుతున్నారు. ఆ కంగారుకు నేడు బ్రేక్ వేయనుంది.



జిల్లాలో భద్రతకు 1600 మంది

- ఫోన్ చేస్తే 10 నిమిషాల్లో స్పాట్‌కు
- ఎక్కడికక్కడ డ్రోన్ కెమెరాలు
- 130 క్విక్ రెస్పాన్స్ టీంలు
- అభ్యర్థుల ఇళ్ల వద్ద భారీ భద్రత
- ఆంధ్రజ్యోతితో ఎస్పీ జగదీశ్

కౌంటింగ్‌కి భద్రత పరంగా సర్వ సన్నద్ధంగా ఉన్నాం. జిల్లా మొత్తం పోలీస్ పహరాలో ఉంది. ఎక్కడ ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడినా పది నిమిషాల్లో చేరుకొని నియంత్రించే విధంగా బలగాలను మోహరించాం. రెండు కంపెనీల సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్‌తో కలిపి మొత్తం 1600 మంది భద్రత సిబ్బంది విధుల్లో ఉంటారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల ఇళ్లు, కార్యాలయాల వద్ద బారికేడ్లు, లైవ్ స్ట్రీమింగ్‌తో సీసీ కెమెరాలతో పాటు సిబ్బందిని ఏర్పాటు చేశాం. అభ్యర్థులు, వారి క్యాడర్‌లోని ముఖ్యులపై నిరంతరాయంగా పోలీస్ నిఘా ఉంటుంది. కొన్ని ఇళ్ల వద్ద కూడా లైవ్ స్ట్రీమింగ్‌తో కెమెరాలు పెట్టాం. డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నాం. రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, నల్లజర్ల, రాజమండ్రి సిటీలో పెద్ద సంఖ్యలో డ్రోన్లు వాడుతున్నాం. గోపాలపురం, రాజానగరం, అనపర్తి అభ్యర్థుల వాహనాలకు ముందు వెనుక వాహనాల్లో పోలీసులు ఉంటారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు, క్యాడర్ కదలికలను ప్రతి నిమిషం గమనిస్తూ ఉంటాం. ఇబ్బందికరంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకుంటారు. జిల్లాలో 130కిపైగా క్విక్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశాం. దేవరపల్లి, కౌంటింగ్ కేంద్రం వద్ద రెండు 'వజ్ర' వాహనాలను మోహరించాం. అంబు లెన్సులను, మెడికల్ టీంలను అందుబాటులో ఉంచాం.గన్‌మ్యాన్లు అందరూ డ్యూటీలో ఉంటారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే ముందు మాటల్లో చెబుతాం. తర్వాత లాఠీ తీస్తాం. మరీ మితిమీరితే మా వైపు నుంచి పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి. ఎంతటి వారైనా కేసులు తప్పవు. ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువత భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి.

ఓటరు నాడి ఎటో..

ఎన్నికల అంకం చివరి ఘట్టానికి చేరుకొంది. ఓటరు నాడి నేడు విడుదల కానుంది. ప్రజలు కట్టే పట్టం కోసం మూడు వారాల నిరీక్షణకు తెరపడనుంది. దీంతో చీమ చిటుక్కుమన్నా యంత్రాంగం ఉలిక్కిపడుతోంది. ప్రశాంతతకు మారుపేరుగా ఉండే తూర్పుగోదావరిలో గతంలో ఎన్నడూ లేని ఉద్వేగ వాతావరణం కనిపిస్తోంది. పైకి గుంభనంగా ఉన్నప్పటికీ భావో ద్వేగాలతో చర్చలు నడిచాయి. అభ్యర్థులు నియోజకవర్గాలకు చేరుకున్నారు. ఎవరి లెక్కలు వారు వేసుకోవడంలో బిజీ అయిపోయారు. నేటి ఫలితాలకు ఒత్తిడిని తొక్కిపట్టుకుని క్షణాలు గడుపుతున్నారు. మూడు నెలల నుంచీ పోలీసులకు కునుకు లేదు. ఆ రోజులన్నీ ఒక ఎత్తు, ఈ రోజు మరో ఎత్తు కావడంతో ఎట్టి పరిస్థితుల్లోనూ అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో మునిగిపోయారు.పోలింగ్ రోజున ఓటు బటన్ నొక్కిన ఓటరు తమ కు నచ్చిన విధంగా చర్చల్లో ఉన్నారు.మార్పు కోసం ఆశ పడుతూ ఎదురు చూస్తున్నారు. మొత్తానికి జిల్లాలో ఎన్నడూ లేని విధంగా హైపర్ టెన్షన్ నిశ్శబ్ద రూపంలో గిరికీలు కొడుతోంది.మంగళవారం మధ్యాహ్నానికి పీఠాన్ని ప్రజలు ఎవరికిచ్చారనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

ఎవరి లెక్కలు వారివి..

ఎన్నికల్లో వివిధ పార్టీలు, స్వతంత్రులు బరిలో నిలిచినా పోటీ మాత్రం వైసీపీ, కూటమి మధ్యనే అనేది తెలిసిందే. ఈ నేప థ్యంలో ప్రధానంగా ఆ పార్టీ అభ్యర్థులు, క్యాడర్ లెక్కలు వేసు కోవడంలో బిజీగా గడుపుతున్నారు. అభ్యర్థులు పైకి చిరునవ్వులు చిందిస్తున్నా గుండెలు మాత్రం తీవ్రమైన ఉత్కంఠతను అనుభవిస్తున్నాయి. అధికారం ఎవరిదో, అప్పుల కుప్పలు ఎవరివో నేటి మధ్యాహ్నానికే తేలిపోనుంది. వైసీపీ నేతల్లో అయోమయంతో కూడిన బెంగ కనిపిస్తోంది.చాలా మటుకు ఓటర్లు రాష్ట్రం మళ్లీ గాడిలో పడే విధంగా బటన్ నొక్కారని ఓటింగ్ సరళిని బట్టి ఎగ్జిట్‌పోల్స్ సైతం అంచనా వేశాయి. దీంతో పార్టీల అధినేతలకంటే ఎక్కువగా 'మార్పు' కోసం ఓటరు అత్యంత ఆసక్తితో ఎదురు చూస్తున్నాడని తెలు స్తోంది. ఎన్నికల గుర్తుల్లో నెలకొన్న అయోమయం ఊహించని విధంగా ప్రాధాన్యం లేని అభ్యర్థులకు కూడా చెప్పుకోదగిన ఓట్లు తెచ్చి పెట్టే పరిస్థితి కానవస్తోంది. ఎగ్జిట్‌పోల్స్ కూడా కూటమికే విజయం ఖాయమంటూ వెల్లడించడంతో వైసీపీ నాయకులు డీలాపడిపోయారు.భవిష్యత్తు కార్యాచరణపై ఎవరి మార్గాల ను వారు ఇప్పటికే వెతుక్కుంటున్నారని సమాచారం. మరోవైపు కూటమి అభ్యర్థుల్లో విజయానందం తాండవిస్తోంది. కాస్త మెజారిటీలు తగ్గినా గెలుపు తమకే దఖలు పడుతుందనే ఆశాభావంతో ఉన్నారు.

పోలీస్ అటెన్షన్

సుమారు మూడు నెలల నుంచీ పోలీసులు ఎన్నికల విధులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. పూర్తి స్థాయిలో మోహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అధికారులు, సిబ్బందితో ఎస్పీ జగదీశ్ పూర్తి సమన్వయం చేసుకుంటూ, ఎక్కడా ఉద్రేకపడకుండా దాదాపు 90 రోజులు లాక్కొచ్చారు. పోలింగ్ రోజు ప్రశాంతంగా గడవడంతో పోలీసులు సగం ఊపిరి పీల్చుకున్నారు.మాచర్ల, పల్నాడులో వైసీపీ నాయకులు సృష్టించిన వీరంగం రాష్ట్రాన్ని ఉలికిపాటుకు గురి చేసింది. ప్రశాంతంగా ఉండే గోదావరి జిల్లాలపై కూడా పోలీసులు తీవ్రంగా దృష్టి సారించారు. 129 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి 39 పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేశారు. 59 మొబైల్ పార్టీలను, 130 క్విక్ రెస్పాన్స్ టీంలను రంగంలోకి దించారు.పోలీసులకు అదనంగా సీఆర్పీఎఫ్,ఎస్ఎస్‌టీ బలగాలున్నాయి.జిల్లా అంతా డ్రోన్ కెమెరాలతో లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతతో పాటు రెడ్‌జోన్‌గా ప్రకటించారు.

ఎన్నికల కేసుల్లో చిక్కితే భవిష్యత్ నాశనమే

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నంత కాలం అత్యంత కఠినమైన చట్టాలు అమల్లో ఉంటాయి. సజావుగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడానికే ఈ ఏర్పాటు జరిగింది. అలాంటి పరిస్థితుల్లో సంయమనం వీడితే కచ్చితంగా ఎన్నికల కేసుల్లో చిక్కుకుంటారు. ఒకసారి ఎన్నికల కేసులో చిక్కుకుంటే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.ఏ ఎన్నికలు జరిగినా ఆ నిందితులను అదుపులోకి తీసుకుంటారు. ఓటు వేయడానికి తీసుకెళ్లి వెనక్కు తీసుకొచ్చి పోలీస్ స్టేషన్‌లో కూర్చో బెడతారు. ఎన్నికల కేసులు అత్యంత పకడ్బందీగా దర్యాప్తు చేస్తారు. రెండేళ్ల కిందట ఉప-ఎన్నికల్లో చేసిన అవకతవకలకు ఏకంగా ఓ ఐఏఎస్ అధికారిపై ఎన్నికల సంఘం ఈ మధ్య కఠినమైన చర్యలు తీసుకోవడం ఇప్పటికే చూశాం.ఎన్నికల సంఘం తీసుకొనే చర్యలు అంత తీవ్రంగా ఉంటాయి.అందువల్ల అటు గీత దాటకుండా అధికారులు, ఇటు సంయ మనం వీడకుండా ప్రజలు వ్యవహరించడం వారికే మంచిది. ఇప్పటికే జిల్లాలో సెక్షన్ 144 సీఆర్పీసీ, సెక్షన్ 30 పోలీస్ యాక్టు అమలులో ఉన్నాయి.శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను ఇప్పటికే పోలీసులు జైలుకు పంపించారు. 13 మందిపై పీడీ యాక్టు బనాయించారు. యువత ఎన్నికల కేసుల్లో ఇరుక్కుంటే జీవితం నాశనమైనట్టే ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులైపోతారు. ఊరేగింపులు,ధర్నాలు,గుమిగూడడం, బైక్‌లపై తిరగడం, బాణసంచా కాల్చడం వంటి వాటిపై నిషేధం ఉందని మరిచి పోవద్దు. గెలుపోట ములకతీతంగా వ్యవహరించాలని, అనవసరంగా రోడ్లపై తిరగవద్దని ఇప్పటికే ఎస్పీ పలు మార్లు సూచించడం గమనార్హం.


మద్యం దుకాణం వద్ద సోమవారం మందుబాబుల క్యూ.

నేడు మద్యం దుకాణాలు బంద్

రాజమహేంద్రవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కౌంటింగ్ అత్యంత ఉత్కంఠగా మారింది. పోలింగ్ తర్వాత కూడా వైసీపీ నాయకులు రెచ్చిపోయారు. ఎక్కడ అల్లర్లు సృష్టిస్తారో తెలియని క్షణాలు గడిచాయి. పరిస్థితులు అలా ఉడికిపోతున్నా జిల్లాలో మద్యం షాపులకు మాత్రం విరామం ఇవ్వలేదు. తొలుత కౌంటింగ్‌కి ఒక రోజు ముందు, ఆ రోజున, తర్వాతి రోజున మద్యం షాపులు, బార్లు మూతపడతాయని అధికారులు చెప్పారు. అంటే 3, 4, 5 తేదీల్లో తెరవకూడదు. కానీ, సోమవారం(3న) ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లు యథేచ్ఛగా నడి చాయి. దీంతో కౌంటింగ్ రోజుకు కావాల్సిన సరుకును పెద్ద ఎత్తున కొను గోలు చేశారని తెలుస్తోంది. పల్నాడు, మాచర్ల వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో మాత్రమే మూడు రోజులని, మిగతా చోట్ల ఎన్ని రోజులు మద్యం షాపులు మూతపడాలో జిల్లా ఎన్నికల అధికారి నిర్ణయిస్తారని అధికారులు చెబుతున్నారు. కౌంటింగ్ రోజైన బుధవారం కచ్చితంగా మూతపడతాయని.. గురువారం మద్యం షాపులు తెరవాలా వద్దా? అనే విషయం జిల్లా ఎన్నికల అధికారి నిర్ణయిస్తారని చెప్పారు.


ఆర్‌వోలతో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కౌంటింగ్ పరిశీలకులు, జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత

అభ్యర్థులు, ఏజెంట్లకు 2500 ఐడీ కార్డులు

ఆర్‌వోలతో కౌంటింగ్ పరిశీలకుల సమీక్ష

దివాన్‌చెరువు, జూన్ 3 : ఓట్ల లెక్కింపునకు రిటర్నింగ్ అధికార్లు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నారని జిల్లా ఎన్నికల అధికారిణి కె.మాధవీలత అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎన్నికల ఓట్లు లెక్కింపు ఏర్పాట్లపై లెక్కింపు పరిశీలకులు, ఆర్వోలతో అంశాల వారీగా సోమవారం సమీక్షించారు.ఎన్నికల సంఘం నియమనిబంధనలు, మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.17 లెక్కింపు కేంద్రాల వద్ద అత్యంత పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పైగా సీసీ కెమెరాలు ఉంటాయని తెలిపారు. లెక్కింపు పూర్తయిన తరువాత నివేదికలు సంసదం తదితర కార్యకలాపాలపై అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. సజావుగా లెక్కింపు ప్రక్రియను చేపట్టేందుకు సంసిద్ధంగా ఉన్నామని తెలిపారు. లెక్కింపు కేంద్రాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం నడచుకోవాలని అభ్యర్థులు, ఏజెంట్లకు స్పష్టం చేశామన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లకు దాదాపు 2500 ఐడీ కార్డులు జారీ చేశామన్నారు. లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. లెక్కింపు పరిశీలకులు కె.బాలసుబ్రహ్మణ్యం, కమల్‌కాంత్‌సరోచ,బీజైకుమార్ కందయాత్‌రాయ్, టాన్‌సింగ్ జి.మోమిన్‌లు వారికి సంబంధించిన నియోజకవర్గాలవారీగా సమీక్ష నిర్వహించి తగిన సూచనలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు విషయంలో ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం జారీ చేసిన మేరకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రాజమండ్రి రూరల్‌ఆర్వో, జెసీ ఎస్.తేజ్‌భరత్, రాజమండ్రిఅర్బన్ ఆర్వో మునిసిపల్ కమీషనర్ కే.దినేష్‌కుమార్, కొవ్వూరు ఆర్వో, సబ్‌కలెక్టర్ అశుతోష్‌శ్రీవాత్సవ్, డిఆర్వో జీ.నరసింహులు, రాజానగరం ఆర్వో , ఆర్డీఓ ఏ.చైత్రవర్షిణి, గోపాలపురం ఆర్వో కె.ఎల్.శివజ్యోతి, అనపర్తి ఆర్వో ఎం.మాధురి, నిడదవోలు ఆర్వో ఆర్.వి.రమణానాయక్, పార్లమెంటుసహాయరిటర్నింగ్ అధికారి ఎస్.డి.సి.కృష్ణానాయక్, ట్రైనీ డిప్యూటీకలెక్టర్లు ఎం.భానుప్రకాష్, పి.సువర్ణ పాల్గొన్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

రౌండ్ రౌండ్‌కీ..
ఏ నియోజకవర్గం ఎక్కడి నుంచి అంటే..

రాజమహేంద్రవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకూ ఒక టెన్షన్. మంగళవారం ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు మొదలైన తర్వాత మరో టెన్షన్. ఏ రౌండ్‌లో ఎవరికి మెజార్టీ వస్తుందనే టెన్షన్ ఉంటుంది. కానీ ఆయా నియోజ కవర్గాల్లో పార్టీ శ్రేణులకు, అభ్యర్థులకు మాత్రం ఏ రౌండ్‌లో ఏ మేరకు ఓట్లు వస్తాయో ఓ మాదిరిగా అంచనా వేసేయగలుగుతారు. ఎందుకంటే పోలింగ్ స్టేషన్ల వారీ ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఓట్ల లెక్కింపునకు ఒక్కో నియోజకవర్గానికి ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపునకు 14టేబుళ్ల వంతున ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. పార్లమెంట్ ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు వేరే టేబుళ్లు ఏర్పాటు చేశారు. ప్రతీ రౌండ్‌లోనూ 14 పోలింగ్ స్టేషన్లలో నమోదైన ఓట్లను లెక్కిస్తారు. తర్వాత మరో 14పోలింగ్‌బూత్‌ల ఓట్లు లెక్కిస్తారు. ఇలా మొత్తం లెక్కింపు పూర్తయ్యేవరకూ ప్రక్రియ కొనసాగుతుంది. ప్రతి నియోజకవర్గం నుంచి మొదటి రౌండ్‌లో 1నుంచి 14వ పోలింగ్‌బూత్ వరకూ నమోదైన ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. దీనిని బట్టి ఆయా ప్రాంతాల్లో అవగాహన ఉన్నవారికి ఓ అంచనా అందేస్తుంది. ఓ రౌండ్‌లో ఓ అభ్యర్థి మెజార్టీ వస్తే, వచ్చే రౌండ్‌లో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తాయో కూడా చెప్పేసే లెక్కలు చాలా మంది వద్ద ఉంటాయి. కౌంటింగ్ ఏ పోలింగ్ స్టేషన్ నుంచి మొదలవుతుంది. ఏ రౌండ్‌లో ఏయే గ్రామాలు, ఏయే ప్రాంతాలు కవరవుతాయనే సమాచారం ముందుగానే వారి దగ్గర పెట్టుకుంటారు. ఏ బూత్‌లో ఎన్ని ఓట్లు పోలయ్యాయో కూడా వివరాలు సేకరించుకుంటారు. దీంతో ప్రతీ రౌండ్‌కు అంచనా ఉంటుంది. కానీ ప్రజలందరూ ఓట్లు ఎలా వేస్తారనేది చెప్పలేక పోవచ్చు. కానీ ఆయా ప్రాంతాల్లో ఓటర్ల నాడి ముందుగానే వాళ్లకు తెలుస్తుంది కాబట్టి, ఆయా రౌండ్లలో ఆయా అభ్యర్థులకు మెజార్టీ ఎంత అనేది కూడా అంచనా వేస్తారు. జిల్లాలో మొత్తం 1577 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. అసెంబ్లీ ఓట్లతోపాటు, పార్లమెంట్ ఓట్లను కూడా సమాంతరంగా లెక్కిస్తారు.


- అనపర్తిలో 228 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇక్కడ 17రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. అనపర్తిలోని 1వ బూత్ నుంచి లెక్కింపు మొదల వుతుంది. మొదట రౌండ్‌లో 1నుంచి 14వ పోలింగ్‌స్టేషన్లలోని ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను లెక్కిస్తారు. తర్వాత బిక్కవోలు, రంగంపేట మండలాల ఓట్లు లెక్కించి, చివరగా పెదపూడి మండలంలోని ఓట్లు లెక్కిస్తారు. కరకుదురు గ్రామంలోని ఓట్ల లెక్కింపుతో మొత్తం ఫలితం వెల్లడవుతుంది.
- రాజానగరంలో 216 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయి. ఇక్కడ 16 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. మొదట రౌండ్ సీతానగరం మండలంలో 1 నుంచి 14వ పోలింగ్‌బూత్‌ల నుంచి మొదలవుతుంది. తర్వాత కోరుకొండ మండలంలోని ఓట్లు లెక్కిస్తారు. చివరిగా రాజానగరం మండలంలోని ముక్కినాడ పాకలు గ్రామంలో ఓట్లు లెక్కిస్తారు.
- రాజమహేంద్రవరం సిటీలో 237 పోలింగ్ కేంద్రాలున్నాయి. 17 రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుంది. సిటీలో మొదట శ్రీరాంనగర్, ఆనందనగర్, రాందాసు పేట, సుబ్బారావునగర్‌లోని క్వారీపేట ఓట్లు లెక్కిస్తారు. తర్వాత సుబ్బారావు నగర్, సిద్ధార్థనగర్, సంజీవయ్యనగర్, బర్మా కాలనీలోని ఓట్లను లెక్కిస్తారు. చివరిగా బ్రాడీపేట, అంబేడ్కర్‌నగర్‌లోని ఓట్లను లెక్కిస్తారు.
- రాజమహేంద్రవరం రూరల్‌లో 267 పోలింగ్ కేంద్రాలున్నాయి. 20 రౌండ్లలో ఇక్కడ లెక్కింపు పూర్తవుతుంది. తొర్రేడు, వెంకటనగరం, కాతేరు, ప్రాంతాల్లోని ఓట్లను లెక్కిస్తారు. రెండో రౌండ్‌లో కాతేరు, కోలమూరు, కొంతమూరులో కొంత భాగం లెక్కిస్తారు. తర్వాత రాయుడుపాకల, మోరంపూడి, హుకుంపేట, సాటిలైట్‌సిటీ, బొమ్మూరు, రాజోలు, ధవళేశ్వరం గ్రామాల ఓట్లు లెక్కింపు అనంతరం రూరల్ నియోజకవర్గం పరిధిలోని రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలోని 8 డివిజన్ల ఓట్లు లెక్కిస్తారు. చివరిగా కడియం మండలంలోని మాధవరాయుడుపాలెంలోని ఓట్లను లెక్కిస్తారు.
- కొవ్వూరులో 176 పోలింగ్ కేంద్రాలున్నాయి. 13 రౌండ్లలో ఇక్కడ లెక్కింపు పూర్తవుతుంది. తాళ్లపూడి మండలంలోని తాడిపూడి 1వ బూత్ నుంచి ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. వరుసగా కొవ్వూరు మండలంలోని కొన్ని గ్రామాలు, మున్సిపాల్టీ వార్డులు, చాగల్లు మండలం, తిరిగి కొవ్వూరు మండలంలో చివరిగా మద్దూరు లంక ఓట్లను లెక్కిస్తారు.
- నిడదవోలులో 205 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇక్కడ 15రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుంది. నిడదవోలు మండలం కోరుమామిడి నుంచి ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. తాడిమళ్ల, ఉనకరమిల్లి, కాటకోటేశ్వరం, సూరాపురం, తిమ్మరాజుపాలెం, తర్వాత నిడదవోలు పట్టణం ఓట్లు, మండలంలోని ఓట్లు లెక్కించాక ఉండ్రాజవరం మండలంలోని ఓట్లను లెక్కిస్తారు. చివరిగా పెరవలి మండలంలోని పిట్టలవేమవరంలోని కడింపాడు ఓట్లను లెక్కిస్తారు.
- గోపాలపురంలో 248 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇక్కడ 18 రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుంది. గోపాలపురం మండలంలోని కరగపాడు నుంచి ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. తర్వాత దేవరపల్లి మండలం, తదుపరి నల్లజర్ల మండలం, ద్వారకాతిరుమల మండలాల్లో లెక్కింపు జరుగుతుంది. చివరిగా పి.కన్నాపురం శివారు సత్తాల ఓట్లు లెక్కిస్తారు.

సాదాసీదాగా కొవ్వూరు సర్వసభ్య సమావేశం


సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ కాకర్ల నారాయుడు

కొవ్వూరు, జూన్ 3: కొవ్వూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ(నారాయుడు) అధ్యక్షతన సోమవారం ఉదయం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ చట్టం-1994 నిబంధనలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి సమావేశం జరిగింది. వివిధ ప్రభుత్వశాఖల అధికారుల తమ శాఖల పురోగతిని వివరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి కొత్త విధాన నిర్ణయాలు, ప్రకటనలు లేకుండా సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశంలో ఎంపీడీవో కె.సుశీల, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు వీరమళ్ల నారాయుడు, నూతంగి రేఖ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆర్థిక సాయం


పార్థుకి ఆర్థిక సాయం అందిస్తున్న జనసేన నాయకులు

నల్లజర్ల, జూన్ 3: మండలంలోని శింగరాజుపాలేనికి చెందిన మద్దాల నాగరాజు కుమారుడు పార్థుకు ఇటీవల రోడ్డు ప్రమాదం జరగడంతో వైద్య ఖర్చుల నిమిత్తం జనసేన గ్రామ కమిటీ సభ్యులు రూ.20 వేలు సాయం అందించారు. సోమవారం పార్థు ఇంటికి వెళ్లి పరామర్శించి నగదు అందించారు. కార్యక్రమంలో దొండపాటి బాబు, దొండపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్‌కు సాయం అందజేత


వృద్ధ దంపతులకు నగదును అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు, జూన్ 3: నిడదవోలులోని రాయిపేటకు చెందిన వృద్ధ పేద దంపతులు చెంగల్వ సుబ్బారావు, కమల కంటి ఆపరేషన్‌కు ప్రవాస భారతీయులు చెన్నా శ్రీనివాసరావు, నాగమణి(యూఎస్‌ఏ) దంపతుల రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆ మొత్తాన్ని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి అంజనేయులు మాట్లాడుతూ రోటరీ సహకారం సమాజంలోని కిందిస్థాయి వర్గాలకు అందించడమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో గొన్నాబత్తుల రామారావు, పొన్నా సుబ్రహ్మణ్య శర్మ, బలగం అప్పారావు, బొజ్జా పాపారావు, ముంగండ చిట్టిబాబు, శివకుమార్ పాల్గొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాళ్లపూడి, జూన్ 3: మండల ఆర్య వైశ్య సంఘం, వాసవీ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 5న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు గోకవరపు బాబులు, కంకిపాటి సాయి వినయ్ తెలిపారు. తాళ్లపూడి బస్టాండ్ వద్ద శ్రీవాసవీ ఆర్యవైశ్య సత్రంలో జరిగే ఈ శిబిరంలో కంటికి సంబంధించిన అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని చెప్పారు. అవసరమైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

టెన్షన్..టెన్షన్..

- ఎన్నికల ఫలితాలపై పెరుగుతున్న ఉత్కంఠ
- ఓట్ల లెక్కింపునకు ఎదురుచూపులు
- ఎగ్జిట్ పోల్స్ ఫలితాలతో గుబులు
- జిల్లాలో తొలి ఫలితం కొవ్వూరు

గోపాలపురం/పెరవలి, జూన్ 3: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడడానికి ఇంకా కొద్ది గంటల సమయం మాత్రమే ఉండడంతో ప్రజానీకం అంతా ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. ఏ నలుగురు కలిసినా అటు గ్రామాలు, ఇటు పట్టణాల్లో ఫలితాలపై తీవ్ర చర్చ సాగుతోంది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగి 22 రోజులైంది. కౌంటింగ్ సమయం దగ్గర పడడంతో అటు నాయకుల్లోను, ఇటు పందెంరాయుళ్లలోను, చివరికి ప్రేక్షక పాత్ర వహించే కార్యకర్తల్లో సైతం నరాలు తెగిపోయే ఉత్కంఠ నెలకొంది. శనివారం సాయంత్రం ఎగ్జిట్‌పోల్స్ విడుదల కావడంతో పందెంరాయుళ్లలో గుబులు పెరిగింది. ఎగ్జిట్‌పోల్స్‌కు, వాస్తవ ఫలితాలకు పొంతన ఉంటుందా లేక తారుమారు అవుతుందా అని తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 2019 ఎన్నికలతోపాటు గతంలో అనేక రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో అంచనాలను తారుమారు చేస్తూ ఫలితాలు వెలువడ్డాయి. దీంతో పందెంరాయుళ్ల బొక్కబోర్లాపడ్డారు. అనేక కుటుంబాలు కూలిపోయాయి. అందుకనే మేధావులు సైతం అంచనాలను, ఎగ్జిట్‌పోల్స్‌ను నమ్ముకుని పందెం కాయవద్దని చెప్పుతున్నారు. ఫలితాల రోజు పరిస్థితి ఎలా ఉంటుందోనని తీవ్ర ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా రెండు రోజులుగా వివిధ సంస్థల సర్వే ఫలితాల్లో కూటమి అభ్యర్థులు ఎక్కువ శాతం గెలుపు సాధిస్తారని చెప్పినప్పటికీ కౌంటింగ్ రోజు ఫలితం ఎలా ఉండబోతుందోనని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గోపాలపురం నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, వైసీపీ అభ్యర్థి తానేటి వనిత, కొవ్వూరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, వైసీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు, నిడదవోలు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి(జనసేన) కందుల దుర్గేష్, వైసీపీ అభ్యర్థి శ్రీనివాసనాయుడు మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఈ నియోజవర్గాల్లో ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. ఓట్ల లెక్కింపు సమయంలో కూడా ప్రతీ రౌండ్ ఉత్కంఠకు గురి చేసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గోపాలపురం నియోజకవర్గంలో మొత్తం 2,42,763 మంది ఓటర్లు ఉండగా 2,10, 399 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇది 86.67శాతంగా ఉంది. ఈ నియోజకవర్గంలో అర్ధరాత్రి 12గంటల వరకూ పోలింగ్ జరగడం విశేషం. కొవ్వూరు నియోజకవర్గంలో 1,84,136 మంది ఓటర్లు ఉండగా


గోపాలపురంలో పార్టీల గెలుపోటములపై చర్చించుకుంటున్న గ్రామస్థులు


ఓట్ల లెక్కింపునకు నన్నయ యూనివర్సిటీలో ఏర్పాట్లు

1,58,176 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇది 85.90శాతంగా ఉంది. జిల్లాలో ఈ నియోజకవర్గానిదే మంగళవారం తొలి ఫలితంగా వస్తుంది. నిడదవోలు నియోజకవర్గంలో మొత్తం 2,13,396 మంది ఓటర్లు ఉండగా 1,80,688 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇది 84.67 శాతంగా ఉంది. మంగళవారం మధ్యాహ్నం 12గంటల నుంచి ఒంటి గంట మధ్య ఇంచుమించు ఫలితాలు వెల్లడి కావచ్చునని అధికారులు చెబుతుండడంతో ఇరు పార్టీల కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు. ఫలితాలు వెల్లడైన అనంతరం ఆయా గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఈ ఫలితాలను వీక్షించేందుకు కొన్ని గ్రామాల్లో పెద్ద స్ర్కీన్‌లను ఏర్పాటు చేస్తుండగా మరికొన్ని చోట్ల టీవీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. గోపాలపురం నియోజకవర్గంలో గోపాలపురం మండలంలో మొదటి కౌంటింగ్ జరుగనుంది. తర్వాత దేవరపల్లి, తదుపరి నల్లజర్ల, చివరిగా ద్వారకా తిరుమల మండలాల కౌంటింగ్ జరుగనుంది. కొవ్వూరు నియోజకవర్గంలో తాళ్లపూడి మండలంలో మొదటి కౌంటింగ్ జరుగనుంది. అనంతరం కొవ్వూరు రూరల్ తదుపరి కొవ్వూరు పట్టణం, తర్వాత చాగల్లు మరలా కొవ్వూరు రూరల్, చివరిగా చాగల్లు మండలానికి సంబంధించి కౌంటింగ్ జరుగనుంది. నిడదవోలు నియోజకవర్గంలో నిడదవోలు మండలంలో మొదటి కౌంటింగ్ ప్రారంభమై అనంతరం ఉండ్రాజవరం, తరువాత పెరవలి మండలం కౌంటింగ్ జరుగుతాయని అధికారులు పేర్కొన్నారు. రౌండ్ రౌండ్‌కు ఫలితాల తీరు ఎలా ఉంటుందో తెలుసుకునేందుకు ఆయా మండలాల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

కొవ్వూరు ఓట్ల లెక్కింపునకు 32 టేబుల్స్

- జిల్లా రిటర్నింగ్ అధికారి మాధవీలత
- నన్నయ వర్సిటీలో కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ

కొవ్వూరు, జూన్ 3: రాజమహేంద్రవరం నన్నయ యూనివర్శిటీలో కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ ఏర్పాట్లను కౌంటింగ్ పరిశీలకుడు ఎమ్.సుబ్రహ్మణ్యం, జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.మాధవీలత సోమవారం పరిశీలించారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ నన్నయ యూనివర్శిటీ ఎస్-బ్లాక్ 2వ అంతస్తులో కొవ్వూరు నియోజకవర్గ పార్లమెంటు సెగ్మెంట్‌కు చెందిన ఈవీఎమ్ ఓట్లు లెక్కించడానికి రూమ్ నెంబరు 314లో 14 టేబుల్స్, అసెంబ్లీ సెగ్మెంటుకు చెందిన ఈవీఎం ఓట్లు లెక్కించడానికి రూమ్ నెంబర్లు 315, 316లలో 14 టేబుల్స్, పోస్టల్‌బ్యాలెట్ ఓట్లకు 4 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి రెండు సార్లు శిక్షణను అందజేశామన్నారు.

దేవరపల్లిలో 60 మంది సిబ్బందితో నిఘా : ఎస్ఐ

దేవరపల్లి, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ మంగళవారం జరుగనున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండలంలో 60 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ కె.శ్రీహరి రావు సోమవారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 144సెక్షన్ అమల్లో ఉంటుందని, రెండు ప్రత్యేక వాహనాల్లో గ్రామాల్లో సిబ్బంది పర్యటిస్తారన్నారు. దేవరపల్లి మండలంలోని మంత్రి తానేటి వనిత గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థులు ముప్పిడి వెంకటేశ్వరరావు, వైసీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు నివాసాలు మండలంలోనే ఉండడంతో వారి ఇళ్ల వద్ద ముగ్గురేసి చొప్పున కానిస్టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో హింసాత్మక సంఘటనలకు, ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు
జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రశేఖర్‌రాజు

నల్లజర్ల, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా రాష్ట్రమంతా సెక్షన్ 144 అమలులో ఉన్నందున ప్రతిఒక్కరు ఇంటి వద్దే ఉండాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ చంద్రశేఖర్‌రాజు హెచ్చరించారు. సోమవారం నల్లజర్లలో ఏపీఎస్పీ, ఏఆర్, స్పెషల్ పార్టీ, ఎస్పీఎఫ్ సిబ్బందితో ఆయన రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలకు, బాణసంచా కాల్చేందుకు, సభలు, డీజేలు పెట్టి ఊరేగింపులు చేసేందుకు ఎలాంటి అనుమతిలేదన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ సురేష్ ఉన్నారు.


నల్లజర్లలో రూట్‌మార్చ్ నిర్వహిస్తున్న అడిషనల్ ఎస్పీ, సీఐ

పరిశోధనకు నూతన వరి విత్తనాలు పంపిణీ

- జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ నరసింహారావు
- పలుచోట్ల రైతులకు అందజేత


వేగేశ్వరపురంలో రైతులకు వరి వంగడాలను అందిస్తున్న శాస్త్రవేత్తలు

దివాన్‌చెరువు, జూన్ 3: పరిశోధన నిమిత్తం నూతన వరి రకాల విత్తనాలను రైతులకు అందజేసినట్టు జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాళ్లపూడి, నల్లజర్ల, దేవరపల్లి, కొవ్వూరు, రాజమహేంద్రవరం రూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో పరిశోధన నిమిత్తం వరిలో కొత్తరకాల విత్తనాలను అందజేశామన్నారు. ప్రస్తుత సార్వా సీజనులో వరిలో నూతన వంగడాలైన ఎంటీయూ-1271, 1275, 1310, బీపీటీ-3082, 2858, 2841 వంటి రకాలను రైతుల కమతాల్లో పరీక్ష చేసి వాటి దిగుబడి, నాణ్యత, చీడపీడలను తట్టుకునే సామర్థ్యం వంటి లక్షణాలను స్థానికంగా రైతులు వేస్తున్న ఎంటీయూ-7029, బీపీటీ-5204 వంటి రకాలతో పోల్చుతామన్నారు. రైతులు నారుమడులు పోసుకునే సమయంలోపే వాటిని అందజేశామని తెలిపారు. ఈ సార్వాకు సంబంధించిన రైతుల కమతాల్లో ప్రయోగాలకు శ్రీకారం చుట్టామని నరసింహారావు పేర్కొన్నారు. రైతుల దిగుబడులను పెంచే దిశగా పరిశోధనలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం మరో ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ ఎస్.హైమజ్యోతి తదితరులు పాల్గొన్నారన్నారు.

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురంలో రైతుభరోసా కేంద్రం వద్దకు జిల్లా ఏరువాక జిల్లా కేంద్రం కోఆర్డినేటర్ నరసింహరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో సార్వా వ్యవసాయం చేపట్టే రైతులకు కొన్ని కొత్త వరి వంగడాలను పరిచయం చేసే కార్యక్రమం చేపట్టారు. దిగుబడి, నాణ్యత, వాతావరణం, చీడపీడలను తట్టుకునే ఎంటీయూ-1271, 1310, 1235, బీపీటీ-3082, 2585, 2841 వంటి వరి విత్తనాల గురించి వివరించారు. గతంలో ఉండే ఎంటీయూ-7029, బీపీటీ-5204 విత్తనాలతో పోలిస్తే ఇవి మెరుగైన విత్తనాలుగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొన్ని రకాల విత్తనాలను కొత్త రకాల విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. నారు మడులు కట్టుకునే సమయానికి విత్తనాలను పూర్తిగా సరఫరా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త హేమజ్యోతి, మండల వ్యవసాయాధికారిణి రుచిత, సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలులో పిచ్చికుక్క స్వైర విహారం
పది మందికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు


గాయపడ్డ వారు

నిడదవోలు, జూన్ 3: నిడదవోలులోని గాంధీనగర్‌లో ఓ పిచ్చికుక్క సోమవారం సాయంత్రం పది మందిపై దాడి చేసి గాయపరిచింది. రోడ్డుపై ఆడుకొంటున్న చిన్నారులను, దారిలో వెళుతున్న వారిని కరిచింది. సుమారు పది మంది గాయపడ్డారు. దీంతో స్థానికులు పిచ్చికుక్కను కొట్టి చంపేశారు. క్షతగాత్రులకు నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా సిబ్బంది సేవలందిస్తున్నారు. పట్టణంలోని రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలను అరికట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

అనంతేశ్వరుడికి అన్నాభిషేకం



కడియం, జూన్ 3: కడియపులంకలో అపర్ణ సమేత అనంతేశ్వర స్వామి పంచాయతన దివ్యక్షేత్రం వార్షికోత్సవం ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగింది. స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అపర్ణాదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అనంతేశ్వరునికి మహా అన్నాభిషేకం చేశారు. ఈ అభిషేక ప్రసాదంతో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామదేవతల జాతరకు ఏర్పాట్లు


మహాలక్ష్మమ్మ ముత్యాలమ్మ, బంగారమ్మ

చాగల్లు, జూన్ 3: మండలంలోని మార్కొండపాడులో గ్రామదేవతలు మహాలక్ష్మమ్మ, ముత్యాలమ్మ, బంగారమ్మ జాతర వేడుకలు ప్రారంభమయ్యాయి. మార్చి 20న అమ్మవార్లను నడివీధిలోకి తీసుకుని వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. 12 ఏళ్లకో సారి జరిగే ఈ జాతరకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలో విద్యుద్దీపాలతో దేవతామూర్తుల రూపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈనెల 7న గ్రామోత్సవం, ప్రత్యేక పూజలు, 8న బలిచేట ఊరేగింపు, 9న అమ్మవార్లకు నైవేద్యములు సమర్పించుకోవడంతో వేడుకలు ముగుస్తాయని తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి


సంఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ సుధాకర్

కొవ్వూరు, జూన్ 3: ఆగివున్న లారీని ఢీకొని మోటారుసైకిలిస్టు మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. కొవ్వూరు మండలం కాపవరం ఎక్స్‌ప్రెస్ హైవేలో ఫ్లైఓవర్ వద్ద మచిలీపట్నం నుంచి రాజానగరం వెళ్తున్న లారీ బ్రేక్ డౌన్ అయ్యింది. జంగారెడ్డిగూడెం నుంచి రంగంపేట మండలం వడిశలేరు బైక్‌పై వెళ్తున్న సోమిశెట్టి సత్యనారాయణ అలియాస్ బుజ్జి(50) ఆగివున్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో ఎస్ఐ సుధాకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని విరాలు సేకరించారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పింఛను..అవస్థలు

- డబ్బులకు బ్యాంకులో నేలపై కూర్చుని ఎదురుచూపులు
- సాయంత్రం వరకూ వేచి ఉన్న వృద్ధులు


తాళ్లపూడి ఆంధ్రా బ్యాంకులో నేలపై కూర్చుని పింఛను సొమ్ముల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

తాళ్లపూడి, జూన్ 3: ఒక టో తారీఖు అంటే వృద్ధులకు పెన్షన్ డబ్బులు వస్తాయని ఎంతో ఆనందంగా ఉండేరోజు. ఎలక్షన్ పుణ్యమా అంటూ పెన్షన్ డబ్బులు బ్యాంక్ ఖాతాల్లో వేసేలా మార్పులు చేశారు. గత నెలలో ఖాతాల్లో డబ్బులు పడని లబ్ధిదారులు బ్యాంకుల వద్దకు వెళ్లి లైన్‌లో నిలబడి నానా తంటాలు పడి పింఛను డబ్బులు తెచ్చుకున్నారు. ఈ నెల కూడా పెన్షన్ డబ్బుల కోసం సోమవారం తాళ్లపూడిలోని ఆంధ్రాబ్యాంక్‌కు వెళ్లిన వారికి ఇబ్బందులు తప్పలేదు. ఆదివారం సెలవు కావడంతో రెగ్యులర్‌గా వచ్చే ఖాతాదారులతో పాటు అదనంగా పెన్షన్‌దారులు కూడా రావడంతో బ్యాంక్ కిక్కిరిసింది. బ్యాంక్ సిబ్బంది రుసరుసలతో వృద్ధులు వేదనకు లోనయ్యారు. ఉదయం వచ్చిన వారు సాయంత్రం వరకూ బ్యాంకు సిబ్బంది ఎప్పుడు పిలుస్తారోనని అన్నపానియాలు సైతం విస్మరించి ఎదురు చూశారు. సాయంత్రం వరకూ బ్యాంక్‌లో బారులు తీరి ఉన్నారు. పింఛను పంపిణీలో సాంకేతిక లోపాలను సవరించడం, లేదా పెన్షన్ ఇంటికి పంపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత చింతలపూడి


విజేత జట్టుకు కప్పు, నగదు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

దేవరపల్లి, జూన్ 3: మండలంలోని యర్నగూడెంలో నిర్వహించిన పోతుల కాంతారావు స్మారక జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో చింతలపూడి జట్టు విజేతగా నిలిచింది. 29 రోజులుగా జరిగిన పోటీల్లో 40జట్లు పాల్గొనగా యాదవోలు జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. విజేతలకు సర్పంచ్ సర్పంచ్ బొంతా భరత్‌బాబు, మాజీ సర్పంచ్ పోతుల బాబురావు సోమవారం బహుమతులు అందించారు. కార్యక్రమంలో బొల్లిన విజయభాస్కర్, గద్దే శ్రీనివాస్, బొల్లిన రమేష్, కోడూరి బద్రి, నల్లం మనోహర్, బెల్లపు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు
యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్1: లవ్ మీ
వై.స్ర్కీన్2 : గంగం గణేశా
దేవిశ్రీ(గాయత్రి) : భజే వాయువేగం
అనన్య : గ్యాంగ్ ఆఫ్ గోదావరి

నిడదవోలు
వీ మ్యాక్స్ : గంగం గణేశా
రాధాకృష్ణ : భజే వాయువేగం
శ్రీగణపతి : గ్యాంగ్ ఆఫ్ గోదావరి

దేవరపల్లి
శ్రీరామ్ సినీ మ్యాక్స్ : ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్ : ఫ్యామిలీ స్టార్

నల్లజర్ల
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్ర్కీన్1 : భీమా
స్ర్కీన్ 2 : ప్రేమలు
శ్రీనివాస : గామి